

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 18-11-2025 | సంపుటి - 25 | సంచిక -183 | రూ : 4 | పేజీలు: 8


## ఏఐ ఉద్యోగాల కంటే అదే పెద్ద సంక్షోభం

ఆనంద్ మహీంద్రా ట్వీట్



2లో



2లో

## స్థానిక సంస్థల ఎన్నికలపై
# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

- రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం
- డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు
- వారోత్సవాల తర్వాత ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం



2లో

## అన్నదాత సుఖీభవ

ఈ నెల 19న రైతుల ఖాతాల్లోకి రెండో విడత నిధులు

- అన్నదాత సుఖీభవ రెండో విడత నిధుల విడుదలకు రంగం సిద్ధం
- 46 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,135 కోట్లు జమ
- ప్రతి రైతు కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర వాటాలు కలిపి రూ.7 వేలు
- నవంబరు 19న కమలాపురంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శ్రీకారం



2లో

## ఢిల్లీ పేలుడు ఘటనలో
# కొత్త అంశం

- షూలో ట్రిగ్గర్ మెకానిజం!
- ఢిల్లీ ఎర్రకోట సమీపంలో కారు బాంబు పేలుడు
- ఘటనలో 13 మంది మృతి, పలువురికి తీవ్ర గాయాలు



2లో

## సౌదీలో ఘోర బస్సు ప్రమాదం..

బాధితులను ఆదుకోవాలన్న కేసీఆర్

- ఉమ్రా యాత్రికులతో వెళుతున్న బస్సు దగ్ధం.. 42 మంది మృతి
- మృతుల్లో హైదరాబాద్ మల్లేపల్లికి చెందిన 16 మంది
- ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి

## ఢిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



2లో

- తాత్కాలిక పరిష్కారాలతో కాలుష్యాన్ని అరికట్టలేమన్న సుప్రీంకోర్టు
- రాజధానిలో నిర్మాణాలపై నిషేధం విధించేందుకు నిరాకరణ
- పర్యావరణ ఆందోళనలు, అభివృద్ధి మధ్య సమతుల్యం ఉండాలని సూచన

## ఆరేళ్ల తర్వాత చైనాకు
# ఎయిరిండియా..

ఢిల్లీ నుంచి షాంఘైకి నాన్‌స్టాప్ విమానాలు!



2లో

- వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 నుంచి ఢిల్లీ-షాంఘై మధ్య నాన్‌స్టాప్ విమానాలు
- వారానికి నాలుగు సార్లు బోయింగ్ 787-8 విమానంతో సేవలు
- 2026లో ముంబై నుంచి కూడా షాంఘైకి సర్వీసులు ప్రారంభించే యోచన
- ఇటీవల ఇండిగో కూడా చైనాకు విమానాలు పునఃప్రారంభం

# షేక్ హసీనాకు ఉరిశిక్ష ఖరారు..

## స్పందించిన మహ్మద్ యూనస్

- గత ఏడాది జరిగిన అల్లర్ల కేసులో షేక్ హసీనాకు మరణశిక్ష
- చట్టానికి ఎవరు అతీతులు కాదన్న యూనస్
- తీర్పు వెలువడిన సమయంలో చప్పట్లతో మార్మోగిన హాలు



2లో



2లో

## సన్‌రైజర్స్ కు ఈసారి కూడా అతడే కెప్టెన్!

- ఐపీఎల్ 2026 సీజన్‌కు సన్‌రైజర్స్ కెప్టెన్‌గా పాట్ కమిన్స్
- మూడో ఏడాది కూడా ఆస్ట్రేలియా స్టార్‌కే నాయకత్వ బాధ్యతలు

## అన్నదాత సుఖీభవ :
# ఈ నెల 19న రైతుల ఖాతాల్లోకి రెండో విడత నిధులు

ఢిల్లీ, నవంబర్ 17 : పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 19వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయనుంది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించనున్నారు. రెండో విడతలో భాగంగా మొత్తం 46,85,838 రైతు కుటుంబాలకు రూ.3135 కోట్ల రూపాయలను ప్రభుత్వం అందించనుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.5 వేలు కలిపి ప్రతి రైతు ఖాతాలో మొత్తం రూ.7 వేలు జమ కానున్నాయి. ఇప్పటికే ఆగస్టు నెలలో తొలి విడత కింద రూ.3174 కోట్లు అందించగా, రెండు విడతల్లో కలిపి మొత్తం రూ.6309.44 కోట్లను రైతులకు అందజేసినట్లు అవుతుంది. ఈ నెల 19న ముఖ్యమంత్రి చంద్రబాబు కమలాపురంలో జరిగే అధికారిక కార్యక్రమంలో పాల్గొని ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. పుట్టపర్తి పర్యటన ముగించుకున్న అనంతరం ఆయన మధ్యాహ్నం కమలాపురం చేరుకుంటారు. ఈ కార్యక్రమాన్ని కేవలం నిధుల విడుదలకే పరిమితం చేయకుండా, వ్యవసాయ రంగంలో ప్రభుత్వ ఆలోచనలను, భవిష్యత్ ప్రణాళికలను రైతులకు వివరించేలా నిర్వహించాలని సీఎం అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 10 వేలకు పైగా రైతు సేవా కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు స్థానికంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా అగ్రిటెక్, డిమాండ్ ఉన్న పంటల సాగు, మార్కెటింగ్ సౌకర్యాలు, ప్రకృతి సేద్యం, భూసార పరీక్షల ప్రాముఖ్యత, ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా పంటకు అదనపు ధర కల్పించడం వంటి కీలక అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్, నవంబర్ 17 : తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజాపాలన వారోత్సవాల అనంతరం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయిచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రివర్గం సమావేశమైంది. ఈ సమావేశంలో ప్రజాపాలన వారోత్సవాలు, సౌదీ అరేబియా ప్రమాదంలో మరణించిన వారికి పరిహారం, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. డిసెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ వారోత్సవాల అనంతరం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడంతో, డిసెంబర్ రెండో వారంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఢిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ, నవంబర్ 17 : ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతంలో వాయు నాణ్యత సూచీ తరచూ 300 నుంచి 400 దాటుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తాత్కాలిక పరిష్కారాలతో కాలుష్యాన్ని అరికట్టలేమని పేర్కొంది. కాలుష్యం నేపథ్యంలో రాజధానిలో నిర్మాణాలపై నిషేధం విధించేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. పర్యావరణ ఆందోళనలు, అభివృద్ధి మధ్య సమతుల్యం ఉండాలని స్పష్టం చేసింది. ఢిల్లీలో వేగంగా పెరుగుతున్న కాలుష్య సమస్యను అరికట్టేందుకు నిర్మాణాలపై నిషేధం విధించడం వంటి సంచలన ఆదేశాలు ఇచ్చేందుకు సుముఖంగా లేమని ఈ సందర్భంగా కోర్టు స్పష్టం చేసింది. ఈ కాలుష్య సంక్షోభాన్ని పరిష్కరించే లక్ష్యంగా నవంబర్ 19లోగా ఒక ప్రణాళికతో రావాలని కేంద్రాన్ని ఆదేశించింది. తాత్కాలిక పరిష్కారాలతో ఎలాంటి ప్రయోజనం ఉండదని, దీర్ఘకాలిక పరిష్కారాలను రూపొందించాలని సూచించింది.

## షేక్ హసీనాకు ఉరిశిక్ష ఖరారు.. స్పందించిన మహ్మద్ యూనస్

నవంబర్ 17 : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్ మరణ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించడంపై బంగ్లాదేశ్ తాత్కాలిక అధినేత మహ్మద్ యూనస్ స్పందించారు. ఈ తీర్పును ఆయన స్వాగతించారు. చట్టం అందరికీ సమానమేనని ఆయన పేర్కొన్నారు. "అధికారంతో సంబంధం లేకుండా ఎవరూ చట్టానికి అతీతులు కారు అని ఈ తీర్పు స్పష్టం చేసింది" అని ఆయన తెలిపారు. గత సంవత్సరం బంగ్లాదేశ్‌లో జరిగిన అల్లర్లకు సంబంధించిన కేసులో, షేక్ హసీనాతో పాటు మాజీ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్, మాజీ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చౌదరి అబ్దుల్లా అల్‌మామున్‌లు మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినట్లు ట్రైబ్యునల్ తీర్పులో పేర్కొంది. హత్య, హత్యాయత్నం, హింసతో పాటు ఇతర అమానవీయ చర్యలకు వారు పాల్పడినట్లు ట్రైబ్యునల్ పేర్కొంది. షేక్ హసీనాకు మరణశిక్ష విధించినట్లు ట్రైబ్యునల్ తీర్పు వెలువరించిన సమయంలో కోర్టు హాలు చప్పట్లతో మార్మోగింది. చాలామంది ఈ తీర్పును స్వాగతించగా, కోర్టు హాలులోపల ఉన్న కొంతమంది కంటతడి పెడుతూ కనిపించారు.



## సన్‌రైజర్స్ కు ఈసారి కూడా అతడే కెప్టెన్!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌కు సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) తమ కెప్టెన్‌గా పాట్ కమిన్స్‌నే కొనసాగించనుంది. వరుసగా మూడో ఏడాది కూడా ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ నాయకత్వంలోనే బరిలోకి దిగనున్నట్లు ఫ్రాంచైజీ సోమవారం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు తమ 'ఎక్స్' ఖాతాలో కమిన్స్ ఫోటోలను పోస్ట్ చేసి స్పష్టతనిచ్చింది. 2024 ఐపీఎల్ వేలంలో రికార్డు స్థాయిలో రూ. 20.50 కోట్లకు కమిన్స్‌ను కొనుగోలు చేసిన ఎస్ఆర్‌హెచ్, వెంటనే అతడికి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. అతని నాయకత్వంలో ఆ సీజన్‌లో సన్‌రైజర్స్ అద్భుతంగా రాణించి రన్నరప్‌గా నిలిచింది. అయితే, 2025 సీజన్‌లో మాత్రం జట్టు ప్రదర్శన నిరాశపరిచింది. 14 మ్యాచ్‌లలో ఆరు విజయాలు, ఏడు ఓటములతో ఆరో స్థానంలో నిలిచి ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయింది. అయినప్పటికీ, కమిన్స్ నాయకత్వంపై యాజమాన్యం పూర్తి విశ్వాసం ఉంచింది. ప్రస్తుతం వెన్నుగాయంతో బాధపడుతున్న కమిన్స్, ఇంగ్లండ్‌తో పెర్త్‌లో జరగనున్న తొలి యాషెస్ టెస్టుకు దూరమయ్యాడు. అతని స్థానంలో స్టీవెన్ స్మిత్ ఆస్ట్రేలియాకు నాయకత్వం వహించనున్నాడు. ఐపీఎల్ 2026 కోసం జట్టులో కొన్ని కీలక మార్పులు కూడా జరిగాయి. విధ్వంసకర ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్‌లను అట్టిపెట్టుకున్న ఫ్రాంచైజీ.. సీనియర్ పేసర్ మహ్మద్ షమీని లక్నో సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ చేసింది. అదే సమయంలో స్టార్ స్పిన్నర్లు ఆడమ్ జంపా, రాహుల్ చాహర్‌లను విడుదల చేసింది. కమిన్స్ సారథ్యంలో బౌలింగ్ విభాగాన్ని పునర్వ్యవస్థీకరించే దిశగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

# ఢిల్లీ పేలుడు ఘటనలో కొత్త అంశం...
## షూలో ట్రిగ్గర్ మెకానిజం!

ఢిల్లీ, నవంబర్ 17 : ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో నవంబర్ 10న జరిగిన కారు బాంబు పేలుడు కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దాడిలో సూసైడ్ బాంబర్ తన 'షూ'లోనే ట్రిగ్గర్ మెకానిజం అమర్చుకుని ఉంటాడనే కోణంలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) లోతుగా విచారణ జరుపుతోంది. ఈ ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. నవంబర్ 10న సాయంత్రం రద్దీ సమయంలో హ్యుందాయ్ i20 కారులో శక్తిమంతమైన పేలుడు పదార్థాలతో వచ్చిన ఉగ్రవాది, మెట్రో స్టేషన్ వద్ద తనను తాను పేల్చుకున్నాడు. అత్యంత సున్నితమైన 'మదర్ ఆఫ్ సాతాన్'గా పిలిచే ట్రైయాసిటోన్ ట్రైపెరాక్సైడ్ను ఈ దాడిలో వాడినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ పేలుడు తీవ్రతకు కారు తునాతునకలైంది. ఘటనా స్థలంలో డ్రైవర్ సీటు కింద దొరికిన ఓ షూ దర్యాప్తును కొత్త మలుపు తిప్పింది. ఈ షూ లోపల ఉన్న మెటల్ భాగాన్ని ట్రిగ్గర్‌గా వాడి ఉండవచ్చని ఎన్ఐఏ అనుమానిస్తోంది. కారు శకలాల మధ్య లభించిన ఓ చీలిన పాదం కూడా దాడి చేసిన ఉగ్రవాదిదేనని భావిస్తున్నారు. 2001లో రిచర్డ్ రీడ్ అనే ఉగ్రవాది విమానం పేల్చేందుకు ప్రయత్నించిన 'షూ బాంబ్' ఘటనను ఈ విధానం గుర్తుచేస్తోంది. ఈ ఆత్మాహుతి దాడికి పాల్పడింది ఫరీదాబాద్‌లోని అల్‌ఫలా యూనివర్సిటీలో మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసిన జైష్‌ఇమొహమ్మద్ ఉగ్రవాది ఉమర్ ఉన్ నబీ అని గుర్తించారు. అక్టోబర్ 30న అతడి సహచరుడు డాక్టర్ ముజమ్మిల్ అహ్మద్‌ను జమ్మూకశ్మీర్ పోలీసులు అరెస్ట్ చేయడంతో ఉమర్ పరారయ్యాడు. ఈ ఉగ్రవాద మాడ్యూల్‌లో ఉన్నత విద్యావంతులైన డాక్టర్లు 'వైట్ కాలర్' నెట్‌వర్క్‌గా పనిచేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఘటనా స్థలంలో 9ఎంఎం తూటాలు కూడా లభించడం పలు అనుమానాలకు తావిస్తోంది. మెవాట్ ప్రాంతంలోని హవాలా నెట్‌వర్క్ ద్వారా నిధులు సమకూరినట్లు ఆధారాలు లభించాయి. ఈ కేసులో ఇప్పటికే ఒక సహాయకుడిని ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. నూహ్, ఫరీదాబాద్ ప్రాంతాల్లో దాడులు నిర్వహిస్తూ దర్యాప్తును ముమ్మరం చేసింది.

## సౌదీలో ఘోర బస్సు ప్రమాదం.. బాధితులను ఆదుకోవాలన్న కేసీఆర్

హైదరాబాద్, నవంబర్ 17 : సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన పలువురు యాత్రికులు మరణించారు. ఉమ్రా యాత్రలో భాగంగా మక్కా నుంచి మదీనా వెళుతున్న బస్సు అగ్నిప్రమాదానికి గురవడంతో 42 మంది సజీవదహనమయ్యారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉమ్రా యాత్ర ముగించుకుని మదీనాకు వెళుతున్న యాత్రికుల బస్సు ఇవాళ తెల్లవారుజామున 1:30 గంటలకు బదర్‌మదీనా మార్గమధ్యంలోని ముఫరహత్ వద్ద ఓ డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో బస్సులో భారీగా మంటలు చెలరేగి, నిద్రలో ఉన్న ప్రయాణికులు అగ్నికి ఆహుతయ్యారు. మృతుల్లో 20 మంది మహిళలు, 11 మంది చిన్నారులు ఉన్నట్లు సమాచారం. ఈ దుర్ఘటనలో మరణించిన వారిలో హైదరాబాద్‌లోని మల్లేపల్లి బజార్‌ఘాట్‌కు చెందిన 16 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటన పట్ల విచారం వ్యక్తం చేసిన కేసీఆర్, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి మృతుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన కోరారు. ప్రమాదం నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం సచివాలయంలో ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. బాధితుల వివరాల కోసం 79979 59754, 99129 19545 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

## ఆరేళ్ల తర్వాత చైనాకు ఎయిరిండియా...
# ఢిల్లీ నుంచి షాంఘైకి నాన్‌స్టాప్ విమానాలు!

ఢిల్లీ, నవంబర్ 17 : టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిరిండియా విమానయాన సంస్థ సోమవారం కీలక ప్రకటన చేసింది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత చైనాకు మళ్లీ తమ సర్వీసులను నడుపుతున్నట్లు వెల్లడించింది. వచ్చే ఏడాది (2026) ఫిబ్రవరి 1 నుంచి ఢిల్లీ, చైనాలోని షాంఘై నగరాల మధ్య నాన్‌స్టాప్ విమానాలను నడపనున్నట్లు తెలిపింది. ఈ మార్గంలో వారానికి నాలుగు సార్లు బోయింగ్ 7878 విమానాలతో సేవలు అందిస్తామని ఎయిరిండియా పేర్కొంది. ఈ విమానంలో బిజినెస్ క్లాస్‌లో 18 ఫ్లాట్ బెడ్ సీట్లు, ఎకానమీ క్లాస్‌లో 238 విశాలమైన సీట్లు అందుబాటులో ఉంటాయని వివరించింది. అంతేకాకుండా, అవసరమైన అనుమతులు లభిస్తే 2026లోనే ముంబై నుంచి కూడా షాంఘైకి నాన్‌స్టాప్ సర్వీసులను ప్రారంభించాలని యోచిస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఈ సర్వీసుల పునఃప్రారంభంపై ఎయిరిండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ మాట్లాడుతూ, "ఇది కేవలం ఒక కొత్త మార్గాన్ని ప్రారంభించడం కాదు. రెండు గొప్ప ప్రాచీన నాగరికతలు, ఆధునిక ఆర్థిక శక్తుల మధ్య ఇదొక వారధి వంటిది. వాణిజ్యం, విద్య, వైద్యం, సాంస్కృతిక రంగాల్లో ప్రయాణికులకు అవకాశాలు కల్పిస్తున్నందుకు సంతోషంగా ఉంది" అని అన్నారు. 2020 ప్రారంభంలో నిలిచిపోయిన విమాన సంబంధాలను పునరుద్ధరించేందుకు ఇటీవల భారత్‌చైనా మధ్య కుదిరిన దౌత్య ఒప్పందాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సర్వీసుల కోసం దశలవారీగా బుకింగ్స్ ప్రారంభిస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. కాగా, ఇటీవలే ఇండిగో సంస్థ కూడా ఢిల్లీ నుంచి చైనాలోని గ్వాంగ్‌జౌకు రోజువారీ విమాన సర్వీసులను ప్రారంభించిన విషయం తెలిసిందే.

## ఏఐ ఉద్యోగాల కంటే అదే పెద్ద సంక్షోభం: ఆనంద్ మహీంద్రా ట్వీట్

ఢిల్లీ, నవంబర్ 17 : కృత్రిమ మేధ (ఏఐ) రాకతో వైట్ కాలర్ ఉద్యోగాలు కనుమరుగవుతాయనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. అయితే, దీనికంటే పెద్ద సంక్షోభం మన ముందు ఉందని, దాన్ని మనం గుర్తించడం లేదని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా అన్నారు. నైపుణ్యం కలిగిన కార్మికుల కొరతే అసలైన సమస్య అని ఆయన తన ట్వీట్‌లో అభిప్రాయపడ్డారు. అమెరికా ఆటోమొబైల్ దిగ్గజం 'ఫోర్డ్' సీఈవో జిమ్ ఫార్లే ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో చెప్పిన విషయాన్ని ఆయన ఉటంకించారు. ఫోర్డ్‌లో ప్రస్తుతం 5,000 మెకానిక్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిలో చాలా వాటికి వార్షిక వేతనం రూ. కోటి (1,20,000 డాలర్లు)కి పైగా ఉన్నప్పటికీ భర్తీ కావడం లేదని మహీంద్రా పేర్కొన్నారు. ఇది కేవలం ఫోర్డ్ కంపెనీకే పరిమితం కాదని, అమెరికా వ్యాప్తంగా ప్లంబింగ్, ఎలక్ట్రికల్, ట్రక్కింగ్ వంటి రంగాల్లో పది లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దశాబ్దాలుగా మన సమాజం డిగ్రీలు, డెస్క్ ఉద్యోగాలకే అధిక ప్రాధాన్యత ఇచ్చిందని, నైపుణ్యం ఆధారిత శ్రామిక శక్తిని విస్మరించిందని మహీంద్రా విశ్లేషించారు. నైపుణ్యం, అనుభవం, నేర్పు అవసరమైన ఈ పనులను ఏఐ భర్తీ చేయలేదని స్పష్టం చేశారు. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో ప్రపంచాన్ని నిర్మించే, నడిపించే, మరమ్మతులు చేసే నైపుణ్యం ఉన్నవారే 'ఏఐ యుగంలో' అతిపెద్ద విజేతలుగా నిలుస్తారని ఆయన జోస్యం చెప్పారు. నైపుణ్యం, కొరత కారణంగా కార్మికులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని, ఇది హింస ద్వారా కాకుండా నైపుణ్యం ద్వారా వచ్చే విప్లవమని కార్ల్ మార్క్స్ కూడా ఊహించి ఉండరంటూ తన పోస్టును ముగించారు.

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ
### స్పీకర్‌కు 4 వారాల గడువు

దిల్లీ, నవంబర్ 17 : తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ అంశంపై సర్వోన్నత న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది. ఈలోపు నిర్ణయం తీసుకోవాలని సూచించింది. కేసు విచారణను కూడా 4 వారాలకు వాయిదా వేసింది. తెలంగాణలో పదిమంది ఎమ్మెల్యేల అనర్హత అంశానికి సంబంధించి దాఖలైన మూడు వేర్వేరు పిటిషన్లు సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చాయి. ఆ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా భారత రాష్ట్ర సమితి దాఖలు చేసిన పిటిషన్లపై మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని జులై 31న జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. అయితే విభిన్న కారణాలవల్ల ఆలోపు నిర్ణయం తీసుకోవడం సాధ్యం కానందున స్పీకర్‌కు మరో రెండునెలలు గడువు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ శాసనసభ కార్యదర్శి దాఖలు చేసిన మిసిలేనియస్ అప్లికేషన్ సీజేఐ ధర్మాసనం ముందు 14వ నంబరులో లిస్ట్ అయింది. అలాగే మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దాఖలుచేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్ 36వ నంబరులో ఉంది. స్పీకర్ మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవడంలో విఫలమైనందున నేరుగా న్యాయస్థానమే తమ పిటిషన్లపై విచారణ చేపట్టి నిర్ణయం వెలువరించాలని కోరుతూ కేటీఆర్ దాఖలు చేసిన మరో రిట్ పిటిషన్ 37వ నంబరులో లిస్ట్ అయింది. ఈక్రమంలో ఆయా పిటిషన్లపై సోమవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది.



# సామాజిక న్యాయం కోసమే.. సీపీఐ కృషి

**- పల్లె శేఖర్ రెడ్డి**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కార్మికులకు, రైతులకు, ప్రజలకు సామాజిక న్యాయం అందించడం కోసం సీపీఐ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో సీపీఐ బస్సు జాత కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ ధ్యేయంగా కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తుందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా కార్మిక, రైతు ఉద్యమాలు, పోరాటాలు, త్యాగాలను ప్రజలకు వివరించేందుకు సిపిఐ వందేళ్ళ బస్సు జాత చేపట్టిందన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం నాయకత్వం వహిస్తూ ప్రారంభమైన సీపీఐ వందేళ్ల ప్రచార బస్సు జాత గద్వాల నుంచి ప్రచార బస్సు జాత ఖమ్మంలో ముగుస్తుందన్నారు. సిపిఐ ఆవిర్భవించి వందేళ్ల ఉత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి బస్సు జాతర నిర్వహించడం జరుగుతుందన్నారు. సాగు, త్రాగు నీరుకై ప్రాజెక్టులు నిర్మించి ఈ ప్రాంతం సస్యశ్యామలం కోసం మూడు దశలుగా సీపీఐ పాదయాత్ర నిర్వహించి అప్పటి ముఖ్యమంత్రికి కనువిప్పు కలిగేలా పెండింగ్ ప్రాజెక్టు లను పూర్తి చేయాలని ఉద్యమాలు చేపట్టిందని గుర్తు చేశారు. ఈ నెల 19న చౌటుప్పల్ పట్టణానికి విచ్చేస్తున్న బస్సు జాత బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. డిసెంబర్ 26న ఖమ్మం లో జరిగే బహిరంగ సభ ఎంతో అట్టహాసంగా జరగనున్నాయని, ఈ సభ లో 45దేశాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. భవిష్యత్తులో వామపక్ష ఐక్యత ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, ఉడుత రామలింగం, పిల్లి శంకర్, కొండూరు విప్లవ్, బద్దుల సుధాకర్, టంగుటూరి రాములు,రండి నరసింహ ,నీళ్ల బిక్షపతి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం..

- **యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు పి. వినయ్ గౌడ్..**
- **కేరుర్ లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ..**



అందోలు, ప్రజాస్ఫూర్తి : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు పి. వినయ్ గౌడ్ అన్నారు. సోమవారం కేరూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి ముగ్గు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా సహకారంతో గ్రామానికి 20 ఇందిరమ్మ ఇళ్ళు మంజూరయ్యాయని వాటి నిర్మాణాలు కూడా జరుగుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల చేత ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ప్రతి వర్గానికి సంక్షేమం, అభివృద్ధి అందించడానికి కృషి చేస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వ లక్ష్యం కేవలం అధికారంలో ఉండటం కాదు ప్రజల జీవిత ప్రమాణాలను మెరుగుపరచడం అని ఆయన వివరిస్తూ, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అందుకోసం అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని గుర్తు చేశారు. ప్రజల కోసం ప్రజా ప్రభుత్వం రైతు రుణమాఫీ, క్వింటాకు 500 రూపాయల బోనస్, ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా, ఉచిత విద్యుత్, మహిళలకు చేయూతగా ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, ఉచితంగా మెరుగైన విద్య, వృద్ధాప్య విధవ వికలాంగుల పెన్షన్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, పేదలకు సన్న బియ్యం, మొదలైనవి వంటి సంక్షేమ పథకాలు ప్రజల కోసం అమలు చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్తీక్ గౌడ్, గ్రామపార్టీ అధ్యక్షుడు కృష్ణ గౌడ్, నాయకులు కుమార్,ప్రభాకర్ గౌడ్, సురేష్, మల్లేశం,జెన్నయ్య, ఉషయ్య, అడివయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో వ్యక్తికి జీవిత ఖైదు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పోక్సో కేసులో వ్యక్తికి జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి (ఫోక్సో స్పెషల్ జడ్జ్. అదనపు ఇంచార్జి) ఎస్.సరిత సోమవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామానికి చెందిన మైనర్‌ను అదే గ్రామానికి చెందిన సయ్యద్ లాలూ ఆగస్టు 6, 2023న అగాయిత్యానికి పాల్పడగా, అట్టి విషయంపై చంద్రుగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇన్‌స్పెక్టర్ రవి కేసు నమోదు చేయగా, సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్ షేక్ అబ్దుల్ రెహమాన్ దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టులో 14 మంది సాక్షులను విచారించిన అనంతరం లాలూపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.వి.డి. లక్ష్మి నిర్వహించారు. కోర్టు నోడల్ ఆఫీసర్ ఎస్సై డి. రాఘవయ్య, లైజాన్ ఆఫీసర్ ఎస్.వీరభద్రం, కోర్టు డ్యూటీ ఆఫీసర్ బి. లక్ష్మణ్‌లు సహకరించారు.

## ఇళ్ల పట్టాలివ్వాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతి

ప్రజా స్ఫూర్తి, ఇల్లందు: పెండింగ్‌లో ఉన్న ఇళ్లపట్టాలు ఇప్పించాలని కోరుతూ మాజీ ఇల్లందు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుదర్శన్ కోరి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి విన్నవించారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం ఇచ్చి త్వరితగతిన సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. జీవో నెం. 76 ప్రకారం ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సి ఉండగా, గతంలో కొన్ని పట్టాలు ఇచ్చారని, ఇంకా కొన్ని పెండింగ్‌లో ఉన్నట్లు సుదర్శన్ కోరి మంత్రికి వివరించారు. అదేవిధంగా రాజీవ్ గృహకల్పకు సంబంధించి ఇంకా 21 మందికి ఇళ్లు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. కొందరు లబ్ధిదారులకు బ్యాంకువారు నోటీసులు ఇచ్చారని చెప్పారు. త్వరితగతిన ఇళ్ల పట్టాలు ఇప్పించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తిచేశారు.

## ఒక్క దెబ్బకు మూడు పిట్టలు.. ఏసీబీ వలలో అవినీతి అధికారులు

ప్రజాస్ఫూర్తి , ఇల్లందు: లంచం తీసుకుంటూ అధికారులు ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్గా చిక్కారు. ఇల్లందు సివిల్ సప్లై డీటీ మొహమ్మద్ద యాకూబ్ పాషా, ఈపాస్ టెక్నికల్ అసిస్టెంట్ ఏ విజయ్, ఇల్లందు రేషన్ డీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు శబరిష్ సోమవారం ఏసీబీకి చిక్కారు. ఎసీబీ డీఎస్పీ వై. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం ఓ రేషన్ షాపులో స్టాక్ తక్కువగా ఉన్నందున రూ.30,000 లంచం ఇవ్వాలని సంబంధిత డీలర్ ను డిమాండ్ చేశారు. ఈ క్రమంలో డీటీ యాకూబ్ పాషా, విజయ్ రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శబరిష్ కు రూ. 30,000 నగదు ఇవ్వాలని రేషన్ డీలర్ను ఆదేశించారు. ఈ క్రమంలో రేషన్ డీలర్ డ్రైవ్ కావడంతో తమ వద్ద అంత డబ్బు లేదని చెప్పినప్పటికీ వినకుండా చెల్లించాల్సిందేనని డీటీ, విజయ్, రేషన్ డీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు శబరిష్ ఒత్తిడి చేశారు.ఈ నేపథ్యంలో రేషన్ డీలర్ ఏసీబీని సంప్రదించి వివరాలు తెలపడంతో సోమవారం ఉదయం రేషన్ డీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు శబరీష్ కు చెందిన జగదాంబ సెంటర్లోని సెల్ షాప్ లో రేషన్ డీలర్ డబ్బులు ఇస్తున్న క్రమంలో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. మొదట పట్టుబడ్డ రేషన్ షాప్ డీలర్స్



అసోసియేషన్ అధ్యక్షుడు శబరీష్ ను ఇల్లందు ఎమ్మార్వో ఆఫీస్ కు తీసుకువచ్చి పూర్తిస్థాయి విచారణ చేపట్టగా సివిల్ సప్లై డీటీ టెక్నీషియన్ విజయ్ ఒత్తిడి మేరకే డీలర్ నుంచి డబ్బు తీసుకున్నట్లు ఒప్పుకున్నాడు. ముగ్గురి పై కేసునమోదు చేసినట్లు ఏసీబీ డీఎస్పి వై రమేష్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఏసీబీ డీఎస్పీ వై రమేష్ పేర్కొన్నారు. ఏసీబీకి సమాచారం ఇచ్చేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు.



## కుషాయిగూడ అన్నపూర్ణ ఎస్టేట్ లో ఘనంగా అయ్యప్ప స్వామి మహాపడిపూజ

- **ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కార్పొరేటర్**

ప్రజాస్ఫూర్తి, కాప్రా : కుషాయిగూడ పారిశ్రామికవాడలోని అన్నపూర్ణ ఎస్టేట్ లో అయ్యప్ప భక్త బృందం కుషాయిగూడ అధ్వర్యంలో అయప్ప స్వామి మహచడి పూజను కన్నుల పండువగా నిర్వహించారు. గురుస్వామి వాసిరెడ్డి శివప్రసాద్ రావు అధ్వర్యంలో బిజ్జ అనంద్ గౌడ్, ఎం.ఎన్.వి క్రిష్ణరావుల 18వ మహపడి పూజను ఘనంగా నిర్వహించారు. పూజా ప్రాంగణంలో విఘ్నేశ్వరుడు, సుభ్రమణ్యాస్వామి, అయ్యప్ప స్వామిల ప్రతిమలతో కేరళ శభరిమల ఆలయం మాదిరిగా బంగారు వర్ణంతో కుడిన 18 వడి మెట్లను ఏర్పాటు చేసి పూలు, పండ్లతో అందంగా అలంకరించారు. ఈకార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మీర్పేట్ హెచ్బి కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర రెడ్డి, మాజీ కార్పొరేటర్ పజ్జురి పావనిరెడ్డిలతో కలసి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు స్వామివారి కీర్తనలు, భజనలతో ఆప్రాంగణమంత అయ్యప్ప స్వామి నామస్మరణతో మారుమోగింది. కోదాడ భాస్కర్ గురుస్వామి భక్త బృదం అలపించిన పాటలకు కన్నెస్వాములు, భక్తులు లయబద్దంగా నృత్యాలు చేస్తూ చూపరులను ఆకట్టుకున్నారు. పూజ అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు, బిక్ష వితరణ చేశారు. ఈకార్యక్రమంలో కనుకుల రజినీకాంత్ రెడ్డి, రామ్మోహన్ రావు. గురుస్వాములు ఎస్ఆర్.శ్రీనివాస్ రావు పి.శ్రీనివాన రావు(శేషు), వీరశేఖర్, ఎస్.రామారావు, మఖార్జునెడ్డి, బదార్ల సాంబశివరావు, కోమటినేని విష్ణుమోహన్రావు, మధుకర్ రెడ్డి, నాగమల్లేశ్వరరావు, స్వాములు వివిధ పార్టీల నాయకులతో పాటు పెద్దఎత్తున భక్తులు తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులకు విద్యతో పాటు సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి

- **డిప్యూటీ డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి యన్.విజయలక్ష్మి**

ప్రజా స్ఫూర్తి, ఇల్లందు: స్థానిక ఇల్లందు వైటీసీ కేంద్రంలో సోమవారం నుంచి ఐటిడిఎ పరిధిలో ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 5 రోజుల ఉపాధ్యా సామర్థ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి యన్. విజయలక్ష్మి హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా డిడి మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఈ ఐదు రోజుల సామర్థ్య నిర్మాణ శిక్షణ ఉపాధ్యాయులకు దోహదపడుతుందని అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక స్పృహ, సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడానికి ఉపాధ్యాయులు ముందుండాలని ఆమె కోరారు. హిందీ,ఇంగ్లీష్,తెలుగు భాషలలో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో మొత్తం 140 మంది ఉపాధ్యాయులు,9 మంది డి.ఆర్.పీలు పాల్గొన్నారు. ఇల్లందు ఏటిడిఓ యు.భారతిదేవి,వైరా ఏటిడిఓ లు పి.రమేష్,ఎస్.రాధమ్మ, ఖమ్మం ఏసీఎంఓ ఎల్.రాములు,ఎస్‌సీఆర్‌పీలు బి.బాల, బి.శంకర్ జి.మూన డి. నాగేంద్రబాబు ఇల్లందు, ఖమ్మం హెచ్ డబ్ల్యు ఓ లు సత్యవతి పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలదారులకు నిత్య అన్న ప్రసాద వితరణ



చౌటుప్పల్,ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డు లోని శ్రీ బాలాజీ రామకృష్ణదేవాలయంలో అయ్యప్ప స్వామి నిత్య అన్న ప్రసాద వితరణ 8వ రోజు నిర్వహించారు. శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్ప స్వామి మలాదారులకు బంధారపు శివ గౌడ్‌నాగలక్ష్మి దంపతుల ద్వితీయ కుమార్తె అనన్య పుట్టినరోజును పురస్కరించుకొని సోమవారం నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్య అన్న ప్రసాద దాతలు మాట్లాడుతూ అయ్యప్ప మాలదారులకు ప్రసాద వితరణ నిర్వహించడం తమ పూర్వ జన్మ సుకృతమని, తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అన్న ప్రసాద దాతల కుటుంబానికి అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఏళ్ల వేళల ఉండాలని, అయురూ ఆరోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు అయ్యప్ప స్వామి ప్రసాదించాలని మనసారా అయ్యప్ప స్వామి మాలదారులు, శివదీక్ష మాలదారులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణ నిర్వాహకులు తొర్పునూరి నర్సింహ గౌడ్, సన్నిధానం గురుస్వామి చెరుకు అశోక్ గౌడ్, కళ్ళెం నాగరాజు గౌడ్, చెవగోని మహేష్ గౌడ్, వరగంటి వెంకటేష్ గౌడ్, స్వాములు మార్గం శేఖర్ యాదవ్, అందోజు సన్నిధ్ చారి, పోల్దాస్ రాజు, చెరుకు రాము గౌడ్, దాసరి మురళిస్వామి, చెవగోని గణేష్ గౌడ్, బందారపు శివగౌడ్, చెరుకు చైతన్య, తొర్పునూరి సాయి, తొర్పునూరి సాయిలుగౌడ్, శివ ప్రసాద్ గౌడ్, కళ్యాణ్ స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు పగిడోజు సంతోష్ కుమార్ శాస్త్రి, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్య రహితంగా తీర్చిదిద్దడమే నిషా విముక్త్ భరత్...

- **విశ్వహిందూ పరిషత్ ధర్మ ప్రసార రాష్ట్ర సహ ప్రాముఖ్ సుభాష్ చందర్...**
- **జోగిపేట ఎస్ఆర్ఎం కళాశాలలో నిషా విముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం**



అందోలు, ప్రజాస్ఫూర్తి:మాదక ద్రవ్య రహితంగా తీర్చిదిద్దడమే నిషా విముక్త్ భరత్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని విశ్వహిందూ పరిషత్ ధర్మ ప్రసార రాష్ట్ర సహ ప్రాముఖ్ సుభాష్ చందర్ అన్నారు. సోమవారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఎం కళాశాలలో నిషా విముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 25 ఏళ్లలోపు యువతే అధికంగా మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారన్నారు. ఈ మత్తు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపడంతోపాటు సమాజంలో కుటుంబం గౌరవం, ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తాయని, మానసిక ఒత్తిళ్ల ప్రభావమో... తోటి స్నేహితుల ప్రోద్బలమో... కారణం ఏదైతేనేం. ఎక్కువగా పిల్లలు, యువతనూ మత్తుమేఘాలు కమ్మేస్తున్నాయన్నారు. మాదక ద్రవ్యాలు చాటు మాటు అంగళ్లు దాటుకుని పాఠశాలలు, కళాశాల ప్రాంగణాలకు విస్తరిస్తున్నాయన్నారు.దీనివల్ల యువత భవిష్యత అంధకారం కానుందని వివరించారు. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు జీవితాలను నాశనం చేస్తుందన్న విషయాన్ని యువత గుర్తించుకోవాలని సూచించారు.మాదక ద్రవ్య రహితంగా తీర్చిదిద్దడమే ప్రధానోద్దేశమని గల్లీల్లోకి చేరువైన మత్తును తరిమికొట్టడానికి..కేంద్ర ప్రభుత్వం నశా విముక్త భారత్ అభియాన్ కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. భారతదేశాన్ని మాదక ద్రవ్య రహితంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధానోద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ లు వినయ్ కుమార్, సంపత్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, జిల్లా ధర్మ ప్రసార ప్రాముఖ్ దివాకర్ , బజరంగ్ దళ్ సంగారెడ్డి జిల్లా సహ సంయోజక్ మనోజ్ గారు, విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షులు కరుణాకర్ , ప్రఖండ బజరంగ్ దళ్ ప్రాముఖ్ శ్రీకాంత్ , ఆంధోల్ మండల బజరంగ్ దళ్ ప్రముఖ ఆంజనేయులు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# వయో వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టంపై అవగాహన

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: శ్రీ సత్య సాయి సమాజ సేవా ట్రస్ట్, జిల్లా న్యాయ సేవాదికార సంస్థ ఆధ్వర్యంలో వయోవృద్ధుల పోషణ , సంక్షేమ చట్టం 2007పై అవగాహన సదస్సు సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ వృద్ధుల సంరక్షణ, పోషణ, వారి ఆస్తుల రక్షణ కోసం ఈ చట్టం కేంద్ర ప్రభుత్వం రూపొందించిందని అన్నారు. వృద్ధులను వారి కుటుంబ సభ్యులు నిర్లక్ష్యం చేసినా, వేధించినా, ఈ చట్టం వారికి రక్షణ కల్పిస్తుందని చెప్పారు. తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్‌లను పోషించడంలో వారి పిల్లలు లేదా బంధువులు విఫలమైతే పోషణ భత్యం కోసం ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చని చెప్పారు. వృద్ధులు తమ ఆస్తిని పిల్లలకు లేదా బంధువులకు బదిలీ చేసిన తర్వాత, వారు తమను సరిగా చూసుకోకపోతే, ఆ బదిలీని రద్దు చేసుకునే అవకాశం ఈ చట్టం కల్పిస్తుందని తెలిపారు. వృద్ధుల సంరక్షణ కోసం ప్రతి జిల్లాలో వృద్ధాశ్రమాలను ఏర్పాటు చేయడానికి, వాటిలో కనీస ప్రమాణాలను పాటించడానికి ఈ చట్టం వీలు కల్పిస్తుందన్నారు. వయోవృద్ధులకు ఉచిత న్యాయ సహాయం అందించబడుతుందని, వృద్ధులు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని, తమకు అన్యాయం జరిగినప్పుడు లేదా నిర్లక్ష్యానికి గురైనప్పుడు



ఈ చట్టాన్ని ధైర్యంగా ఉపయోగించుకోవాలని సూచించారు. వయోవృద్ధులు లేదా వారి తరపున ఇతరులు ఈ చట్టం కింద ఫిర్యాదు చేయడానికి మెయింటెనెన్స్ ట్రిబ్యునల్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం స్పెషల్ జ్యూడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మెండు రాజమల్లు, వైస్ ప్రెసిడెంట్ గోపికృష్ణ, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి. నిరంజన్ రావు, అడ్వకేట్ మారపాక రమేష్, సత్యసాయి ఆర్గనైజర్ సుబ్బారావు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

## కార్తీక మాసంలో సోమవారం జ్యోతితో మనసు ఉత్తేజితం

* ట్రినిటీలో కోటి దీపోత్సవం
* డాక్టర్ ఉజ్జిని మంజుల



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కార్తీక మాసంలో సోమవారం రోజున జ్యోతి వెలిగించడం వలన మనసులో చెడు వదిలి మంచి ఉత్తేజం అవుతుందని ట్రినిటీ హై స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ట్రినిటీ హై స్కూల్ లో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భాన్ని పురస్కరించుకొని కోటి దీపోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రినిటీ హై స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల హాజరయ్యారు. కోటి దీపోత్సవం పూజా నిర్వహించారు. అనంతరం విద్యార్థుల చేత దీపం వెలిగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మంజుల మాట్లాడుతూ కార్తీక మాసంలో సోమవారం రోజున జ్యోతి వెలిగించడం శుభ సూచికమన్నారు. విద్యార్థులచే జ్యోతులు వెలిగించడం వలన విద్యార్థుల మనోవికాసం ఉత్తేజమైందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ కృష్ణారావు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరంలు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ శాఖ ఉప కార్యాలయాన్ని పరిశీలించిన ప్రాజెక్టు అధికారి రాహుల్



ప్రజా స్ఫూర్తి , ఇల్లందు: ఇల్లందు ప్రాంతంలో మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన సుదిమల్ల గిరిజన ఉప ఇంజినీరింగ్ కార్యాలయాన్ని ప్రాజెక్టు అధికారి రాహుల్ పరిశీలించారు. ప్రాంతీయ అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పొంగిలేటి శ్రీనివాస్‌రెడ్డి తో పాల్గొనడానికి వచ్చిన సందర్భంలో ఇంజినీరింగ్ అధికారుల వినతితో ఈ పరిశీలన జరిగింది.పాత భవన పరిస్థితిని పరిశీలించిన ప్రాజెక్టు అధికారి,కొత్త భవనం ఆమోదం పొందే వరకూ అవసరమైన మరమ్మత్తులు చేసి కార్యాలయాన్ని నిర్వహించాలని గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుకర్ కు సూచించారు. ఉమ్మడి ఖమ్మం పరిధిలోని సుదిమల్ల,అశ్వారావుపేట, పాలొంచ కేంద్రాల్లో గిరిజన శాఖ సిబ్బందికి సౌకర్యం కల్పించేందుకు కొత్త ఉప విభాగ భవనాల నిర్మాణ ప్రతిపాదనలు పంపించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రధాన ఇంజినీర్ మధుకర్, ఉప ప్రధాన ఇంజినీర్ రాజు, సహాయ ఇంజినీర్లు శ్రీకాంత్, మహేందర్‌లు ప్రాజెక్టు అధికారికి వివరించారు.అనంతరం మంత్రి గారితో కలిసి జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో గిరిజన శాఖ ఇంజినీరింగ్ అధికారులు కూడా పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిరోధంపై అవగాహనకు ‘సంకల్పం’ : గుంటూరు ఎస్పీ

గుంటూరు: డ్రగ్స్ నిరోధంపై అవ గాహనకు ‘సంకల్పం’ పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. మంగళవారం అమరావతి విట్ వర్సిటీలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. డ్రగ్స్ విక్రయిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేసిన సందర్భంగా ఎస్పీ మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఠా నుంచి 17 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముఠా బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి ఇక్కడ సరఫరా చేస్తున్నారని, బెంగళూరులో డ్రగ్స్ తయారీదారులను గుర్తించాల్సి ఉందని చెప్పారు. గంజాయి, డ్రగ్స్ ముఠాపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

## నేటి నుంచి కిన్నెరసానిలో ఐటిడిఏ జోనల్ స్థాయి గిరిజన క్రీడలు ప్రారంభం

* క్రీడా మైదానాన్ని పరిశీలించిన
* ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా క్రీడా అధికారి బి.గోపాల్ రావు,
* ఏటీడీవో చంద్రమోహన్..

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:(పాల్వంచ) : ఐటిడిఏ భద్రాచలం ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఐఏఎస్ ఆదేశాల మేరకు భద్రాచలం ఐటిడిఏ పరిధిలో జోనల్ స్థాయి లీగ్ పోటీలు మరియు ఎంపికల గిరిజన క్రీడలు నవంబర్ 18, 19 తేదీలలో ప్రభుత్వ ఆదర్శ క్రీడా పాఠశాల,కిన్నెరసానిలో నిర్వహించనున్నారు.నవంబర్ 18న బాలికలు,19న బాలురు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో సిద్ధం చేసిన క్రీడా మైదానాలను ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా క్రీడా అధికారి బి.గోపాల్ రావు,ఏటీడీవో చంద్రమోహన్ పరిశీలించారు. వాలీబాల్ ,కబడ్డీ ,ఖో ఖో, టెన్నికోయిట్ ,విలువిద్య, అథ్లెటిక్స్,400 మీటర్ల పరుగుపందెం,చేస్,క్యారమ్ తదితర క్రీడల మైదానాలు పూర్తిగా సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. జోనల్ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 3, 4, 5 తేదీలలో వరంగల్ జిల్లా ఏటూరు నాగారం ఐటిడిఏ పరిధిలో జరిగే రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో క్రీడల అధికారి బొల్లి గోపాల్ రావు, ఏటీడీవో చంద్రమోహన్, ఎ.ఎస్.ఓలు కొమరం వెంకట నారాయణ,సోయం నాగేశ్వరరావు, బండ రాంబాబు, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు బి.శంకర్,వార్డెన్ పోలేబోయిన వెంకటేశ్వర్లు పి.డి లు, ఎస్.బాలసుబ్రమణ్యం, ఎ.శ్రీనగేష్ పి.రాంబాబు, ఐ.గోపాలరావు,బి.మోతిలాల్, బి.హరికృష్ణ, వి.ముత్తయ్య, వీరభద్రం అలాగే కోచ్‌లు వాసు,ప్రసాద్, స్థానిక పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## భగత్ సింగ్ నగర్ గుడిసె వాసులకు న్యాయం చేయండి

**మేడిపల్లి మండల తహసిల్దార్ కి వినతి**

మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : మేడిపల్లి మండలం పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భగత్ సింగ్ నగర్ కాలనీ వాసులకు న్యాయం చేయాలని సోమవారం సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో మేడిపల్లి మండల తహసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రచ్చ కిషన్, జె లక్ష్మీలు మాట్లాడుతూ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భగత్ సింగ్ నగర్ కాలనీలో గత 20 సంవత్సరాల క్రితం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వేయడం జరిగినది. ఇప్పుడు కొంత మంది ఖాళీ ఉన్న ప్రదేశంలో కొత్త గుడిసెలు వేయడంతో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పుడు వేస్తున్న కొత్త గుడిసెలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాలపై కొంతమంది కోర్టు కేసు వేయడం జరిగినది. ఈ కోర్టు కేసు ఆపిల్ వెయ్యాలని కొంతమంది గుడిసెలలో డప్పు చాటింపు చేసి లాయర్ కు డబ్బులు కట్టాలని, పేద ప్రజల దగ్గర డబ్బులు వసూలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కేసును ప్రభుత్వమే తీసుకుని ఈ పేద ప్రజల పక్షాన న్యాయం పోరాటం చేయాలని లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలని ఎవరైతే స్థానికంగా గుడిసెలలో నివాసం ఉంటున్నారో పట్టాలు రాని వారికి వెంటనే ప్రభుత్వం తరపున పట్టాలు ఇప్పించాలన్నారు. ఎవరైతే కాలి స్థలాన్ని కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తున్నారో వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ పార్టీ నుంచి తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి సిహెచ్ మాధవి, బీసీ సంఘం జిల్లా నాయకురాలు కె ప్రమీల, బి కే ఎం యు కార్యదర్శి & అధ్యక్షులు కే మహాలక్ష్మి, భూతం ఐలయ్య, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ లో సామూహిక దీపోత్సవం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం కేంద్రంలోని శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో కార్తీక మాసం చివరి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ వెన్ రెడ్డి సంధ్య రాజు, ట్రినిటీ విద్యాసంస్థల డైరెక్టర్ ఉజ్జిని మంజుల ఆధ్వర్యంలో సామూహిక దీపోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణమంతా దీపాలతో వెలిగించారు. దీపాలను చౌటుప్పల్ పూర చెరువులో వదిలారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ ఛాంబర్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, ట్రినిటీ పాఠశాల చైర్మన్ కేవిబి కృష్ణారావు, పి శ్రీలత, బొబ్బిళ్ళ సంధ్య, కామిశెట్టి శైలజ, సందగళ్ళ విజయ, సువర్ణ, ఐలమ్మ, గ్లోబల్ ఫ్యామిలీ మహిళలు, రామాలయ డైరెక్టర్ గుర్రం వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కి జన్మదిన శుభాకాంక్షలు



శేరిలింగంపల్లి , (ప్రజాస్ఫూర్తి) : జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ జన్మదినం సందర్బంగా వారినివాసం వద్ద సోమవారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పల ఏకాంత్ గౌడ్ , వారి మిత్రబృందంతో కలిసి నవీన్ యాదవ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో రాచమళ్ళ క్రిష్ణ గౌడ్, విక్రమ్ గౌడ్, మహేష్ గౌడ్ బాబు గౌడ్ పాల్గొన్నారు.

# సమస్యలపై మంత్రి ఫోకస్.. కీలక హామీ

నెల్లూరులో ప్రధాన సమస్యలపై రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో హామీ ఇచ్చిన గంటల వ్యవధిలోనే సమస్యల పరిష్కారానికి మంత్రి కార్యచరణ చేపట్టారు. నెల్లూరు సండే మార్కెట్లో వర్షాలు వచ్చిన సమయంలో నెలకొంటున్న తీవ్ర ఇబ్బందికి పరిష్కారమార్గం చూపారు. సండే మార్కెట్ వద్ద రోడ్డు పనులకు మంత్రి నారాయణ శంకుస్థాపన చేశారు. అలాగే ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి వద్ద కోటి రెండులక్షలతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభింప చేశారు. శంకుస్థాపన కార్యక్రమాలకు విచ్చేసిన మంత్రి నారాయణకు స్థానిక టిడిపి నేతలు ఘనంగా స్వాగతం పలికారు. అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ మంత్రి నారాయణ ముందుకు కదిలారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి రోడ్డు వద్ద నెలకొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా పనులకు శంకుస్థాపన చేసామన్నారు. 44 రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. డిసెంబర్ 31వ తేదీన



ఈ రోడ్డును ప్రారంభిస్తామని తెలియజేశారు. రద్దీ ప్రాంతం కావటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వన్ సైడ్ రోడ్ పనులు తొలివిడతగా చేపట్టామన్నారు. మరో కోటి రూపాయలతో డిసెంబర్ 31 న రెండో సైడ్ రోడ్ పనులకు శంకుస్థాపన చేస్తానన్నారు. ఫిబ్రవరి 15 న రోడ్డును ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా సండే మార్కెట్లో వర్షాల సమయంలో నెలకొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సండే మార్కెట్ ప్రాంతాన్ని పరిశీలించి వెంటనే పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. కాలువలపై ఆక్రమణదారులు సహకరిస్తే పూడిక తీయించి వర్షపు నీరు సజావుగా వెళ్లే విధంగా చేస్తామన్నారు. తద్వారా సండే మార్కెట్లో మరోసారి వర్షపు నీరు నిలిచే అవకాశం ఉండదని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజాపాలన వారోత్సవాల తర్వాత ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. కేబినెట్ భేటీ అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్ల బిల్లును కేబినెట్ ఆమోదించినట్లు చెప్పారు. అంతేకాకుండా గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమం బిల్లును కేబినెట్ ఆమోదించిందన్నారు.



" ఇటీవల ప్రాణాలు కోల్పోయిన ప్రముఖ కవి అందెశ్రీ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండాలని నిర్ణయించింది. ఆయన కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించాం. అందెశ్రీ స్మృతి వనం ఏర్పాటు చేస్తాం. పాఠ్య పుస్తకాల్లో అందెశ్రీ రాసిన తెలంగాణ గీతం పెడతాం. బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించాం. పార్టీ పరంగానూ 42 శాతం రిజర్వేషన్లు ఇస్తాం. మొదట గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించాం. 15వ ఆర్థిక సంఘం కాలపరిమితి వచ్చే ఏడాది మార్చి 31తో ముగియనుంది. అప్పటిలోగా ఎన్నికలు పూర్తికాకపోతే.. గ్రామాలకు రావాల్సిన దాదాపు రూ.3వేల కోట్ల నిధులు కోల్పోతాం. హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం.. 50శాతం రిజర్వేషన్ల పరిధికి మించకుండా ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. డెడికేటెడ్ కమిషన్ బీసీలకు 42 శాతం ప్రకారం రిజర్వేషన్ల జాబితాను ఇప్పటికే ఇచ్చింది. దాని ఆధారంగానే ఎన్నికల ప్రక్రియ కూడా మొదలైంది. అయితే, కోర్టులో కేసులు పడటంతో ఎన్నికల ప్రక్రియ అర్ధాంతరంగా నిలిచి పోయింది. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల సంఖ్యపై డెడికేటెడ్ కమిషన్ నుంచి నివేదిక కోరాలని కేబినెట్ తీర్మానించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై కోర్టు తీర్పులు కొలిక్కి వచ్చిన తర్వాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై కేబినెట్ తదుపరి నిర్ణయం తీసుకుంటుంది. ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 2 మెయిన్ కెనాల్‌కు మాజీ మంత్రి దివంగత రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేరు పెట్టేందుకు మంత్రివర్గం ఆమోదించింది. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న ఇండస్ట్రియల్ ల్యాండ్‌ను మల్టీ యూజ్ జోన్స్‌గా మార్చేందుకు రూపొందించిన 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ'కి కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రజా ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్ 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 నిర్వహించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది" అని పొంగులేటి పేర్కొన్నారు.



## ఓపెన్ ప్లాట్ల వేలం.. ప్రభుత్వానికి రూ.46 కోట్ల ఆదాయం

హైదరాబాద్: రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని ఓపెన్ ప్లాట్ల విక్రయానికి మరోసారి మంచి స్పందన వచ్చింది. ఓఆర్ఆర్ సమీపంలోని తొర్రూర్, కుర్మల్‌గూడ, బహదూర్‌పల్లి ప్రాంతాల్లోని 163 ప్లాట్లకు బహిరంగ వేలం నిర్వహించారు. రెండ్రోజులపాటు జరిగే ఈ బహిరంగ వేలంలో తొలి రోజు సోమవారం తొర్రూర్‌లోని 59 ప్లాట్లకు వేలం నిర్వహించారు. ఈ విక్రయాల్లో అత్యధికంగా చదరపు గజానికి రూ.39వేలు ధర పలికింది. కనీస ధర చదరపు గజానికి రూ.25వేలుగా నిర్ధారించి వేలం నిర్వహించగా.. సగటున రూ.28,700 ధర పలికింది. సోమవారం విక్రయాల ద్వారా మొత్తం రూ.46 కోట్ల మేర ఆదాయం వచ్చిందని స్వగృహ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ తెలిపారు. ఈ వేలంపాటలో 110 మంది బిడ్డర్లు పాల్గొన్నారని తెలిపారు. తొర్రూర్‌లోని మిగిలిన 65 ప్లాట్లకు, కుర్మల్‌గూడలోని 25 ప్లాట్లు, బహదూర్‌పల్లిలోని 13 ప్లాట్లకు మంగళవారం వేలం నిర్వహించనున్నట్లు గౌతమ్ చెప్పారు.



## గుడ్ న్యూస్.. విశాఖ కొల్లం మధ్య 20 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖపట్నం కేరళలోని కొల్లం మధ్య 20 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. మంగళవారం నుంచి జనవరి 21 వరకు ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయని తెలిపింది. ఈ నెల 18 నుంచి ప్రతి మంగళవారం విశాఖ కొల్లం (08539), ప్రతి బుధవారం కొల్లం విశాఖపట్నం (08540) రైళ్లు రాజమండ్రి, విజయవాడ, నెల్లూరు, రేణిగుంట మీదుగా నడుస్తాయి. 2 ఏసీ, 3 ఏసీ, స్లీపర్ బోగీలతో ఈ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే పేర్కొంది. ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కూడా ఉందని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఓ ప్రకటనలో తెలిపింది.

## ఓటు చోరీపై నిరసనలు తెలుపుతాం

**: మంత్రి పొన్నం**

హైదరాబాద్: భాజపా అధికారంలోకి రావడానికి అనేక రకాలుగా ఓట్లు తొలగించి చోరీకి పాల్పడుతోందని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా ఓటు చోరీపై కాంగ్రెస్ పార్టీ నిరసనలు తెలపనున్నట్లు చెప్పారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా గాంధీభవన్‌లో తెలంగాణ యువజన కాంగ్రెస్ మహా నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నంతోపాటు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ యూత్ కాంగ్రెస్ సైనికులుగా మారి ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి శక్తివంతంగా పనిచేయాలని



దిశానిర్దేశం చేశారు. దేశవ్యాప్తంగా ఓటుచోరీపై నిరసనలు ఉద్ధృతం చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఇంటింటికి తీసుకెళ్లాలని చెప్పారు. అలాగే, సౌదీ బస్సు ప్రమాదంలో మృతి చెందిన యాత్రికులకు యూత్ కాంగ్రెస్ నివాళులర్పించింది.

## ముందు సర్పంచ్ ఎన్నికలు: మంత్రి పొంగులేటి

తెలంగాణ కేబినెట్ సమావేశం ముగిసింది. సుమారు ఆరు గంటల పాటు సాగిన భేటీలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చిత్తశుద్ధితో భావించాం.. రాష్ట్రపతి దగ్గర బీసీ రిజర్వేషన్ బిల్లు ఆగిపోయిందని అన్నారు. రాష్ట్రంలో మొదట సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టత ఇచ్చారు. పార్టీపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపారు. మిగిలిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు అన్ని కూడా కోర్టు తీర్పు తర్వాత నిర్వహిస్తామని అన్నారు. గిగ్ వర్కర్ల బిల్లుకూ కేబినెట్ ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. పాఠ్య పుస్తకాల్లో అందెశ్రీ గేయాన్ని చేర్చాల్సిన నిర్ణయించినట్లు తెలిపారు.

## జిన్నింగ్ మిల్లర్ల సమస్యలు పరిష్కరిద్దాం తెలంగాణకు రండి

హైదరాబాద్: తెలంగాణలో జిన్నింగ్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతుల పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు తెలంగాణ జిన్నింగ్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రకటించిన నేపథ్యంలో రైతుల, జిన్నింగ్ మిల్లర్ల సమ్యలపై చర్చించేందుకు మంగళవారం రాష్ట్రానికి రావాలని సీఐఐ సీఎండీ, ఇతర అధికారులను కోరారు. సచివాలయం నుంచి రాష్ట్ర సహకార సంస్థ ఛైర్మన్, సీఈవో, జిల్లా సహకార అధికారులతో మంత్రి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ సంబంధించి సీసీఐ తీసుకొచ్చిన నిబంధనల



కారణంగా క్షేత్రస్థాయిలో రైతులు ఇబ్బందులు పడుతుండటం, జిన్నింగ్ మిల్లుల యజమానులు గిట్టుబాటు కావడం లేదంటుండటంతో నెలకొన్న గందరగోళానికి తెరదించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమీక్షలో విస్తృతంగా చర్చించారు. ఇప్పటికే ఈ విషయాన్ని కేంద్ర జౌళి శాఖమంత్రి గిరిరాజ్ సింగ్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేకుండాపోయిందని మంత్రి అన్నారు. పత్తి రైతుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని తక్షణమే జిన్నింగ్ మిల్లర్ల సమస్యల పరిష్కరించే దిశగా కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి చొరవ చూపాలని కోరారు. రైతుల సంక్షేమమే ముఖ్యంగా డీసీవోలు, డీసీసీబీల పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. సోయాబీన్ సేకరణలో నాఫెడ్ తీసుకొచ్చిన ఆధార్ అథెంటికేషన్ నిబంధన కారణంగా రైతులు, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు.

## క్షమించండి.. మా సేవలు శాశ్వతంగా నిలిపివేశాం: ఐ బొమ్మ

హైదరాబాద్: ఐబొమ్మ, బప్పం టీవీ వెబ్‌సైట్ల నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టయిన నేపథ్యంలో ఐ బొమ్మ ఓ ప్రకటన విడుదల చేసింది. తమ సేవలను శాశ్వతంగా నిలిపివేశామని వెబ్‌సైట్లో వెల్లడించింది. కొత్త సినిమాలు, ఓటీటీ వేదికల్లోని కంటెంట్‌ను పైరసీ చేస్తూ సినీ పరిశ్రమకు తీవ్ర నష్టం కలిగిస్తున్న ప్రధాన నిందితుడు రవిని శనివారం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఐ బొమ్మ, దాని అనుబంధంగా ఉన్న 65 వెబ్‌సైట్లను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బ్లాక్ చేశారు. "మీకు ఇటీవల మా గురించి తెలిసి ఉండొచ్చు. లేదంటే.. మొదటి నుంచి నమ్మకమైన అభిమానై ఉండొచ్చు. ఏదేమైనా.. మీ దేశంలో మా సేవ శాశ్వతంగా నిలిపివేశామని చెప్పేందుకు చింతిస్తున్నాం. అందుకు క్షమాపణలు కోరుతున్నాం" అని ఐ బొమ్మ ప్రకటనలో పేర్కొంది. గత ఏడెనిమిదేళ్లుగా పైరసీ సినిమాలు, వెబ్‌సిరీస్‌లకు ఐ బొమ్మను వేదికగా మార్చిన ఇమ్మడి రవి (40)ని శనివారం సైబర్ క్రైమ్ పోలీసులు కూకట్‌పల్లిలో అరెస్ట్ చేశారు. ఇతడు నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌లో రూ.3 కోట్ల



నగదు, వందల కొద్దీ హార్డ్ డిస్క్‌లు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్లను గుర్తించినట్టు సమాచారం. నిందితుడిని బషీర్‌బాగ్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్)కు తరలించి కీలక సమాచారం సేకరించారు. అనంతరం నాంపల్లి న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## సౌదీ రోడ్డు ప్రమాదం.. ఒకే కుటుంబంలో 18 మంది మృతి



హైదరాబాద్: సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌లోని విద్యానగర్‌కు చెందిన నజీరుద్దీన్ కుటుంబంలోని 18 మంది మృతి చెందారు. నసీరుద్దీన్ ఓ విశ్రాంత రైల్వే ఉద్యోగి. తన కుటుంబ సభ్యులతో కలిసి మక్కా యాత్రకు వెళ్లారు. అంతలోనే ఈ ఘోర ప్రమాదం వారి కుటుంబాన్ని కబళించింది. విషయం తెలుసుకున్న నసీరుద్దీన్ బంధువులు, స్నేహితులు అతడి నివాసం వద్దకు చేరుకున్నారు. ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. బాధితకుటుంబ బంధువులను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పరామర్శించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఎలాంటి అవసరం ఉన్నా తనను సంప్రదించాలని భరోసా ఇచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్.. నసీరుద్దీన్ ఇంటికి వెళ్లి ఆయన బంధువులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికే ఆ దిశగా చర్యలు మొదలు పెట్టినట్లు చెప్పారు. మరోవైపు నసీరుద్దీన్ ఇంటి వద్ద రోదనలు మిన్నంటాయి. ఒకే కుటుంబంలో 18 మంది ప్రాణాలు కోల్పోవడాన్ని నమ్మలేకపోతున్నామంటూ ఆయన బంధువులు, స్నేహితులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు 18 మంది అంత్యక్రియలను సౌదీలోనే నిర్వహించనున్నట్లు నసీరుద్దీన్ బంధువులు పేర్కొన్నారు. మరోవైపు ఇదే ప్రమాదంలో.. హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పురాకు చెందిన ఐదుగురు మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ పరామర్శించారు. సౌదీలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 45 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. వీళ్లంతా హైదరాబాద్ వాసులేనని తెలంగాణ హజ్ కమిటీ ఓ ప్రకటన విడుదల చేసింది. మృతి చెందిన వారిలో 17 మంది పురుషులు, 18 మంది మహిళలు, 10 మంది చిన్నారులు ఉన్నట్లు పేర్కొంది. మొత్తం నాలుగు ట్రావెల్ ఏజెన్సీల ద్వారా ఈనెల 9న హైదరాబాద్ నుంచి వీరంతా ఉమ్రాకు బయల్దేరారు. విజయవంతంగా మక్కా యాత్ర పూర్తిచేసుకుని మదీనాకు వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. మదీనాకు 25 కి.మీ దూరంలో బస్సు డీజిల్ ట్యాంకర్ ఢీకొన్నాయి.

## ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ II ఫలితాలు విడుదల... సెలక్షన్ జాబితా ఇదే!

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో 1,284 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ II పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. ఈ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా సచివాలయంలోని తన కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం విడుదల చేశారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాతో పాటు, ఫైనల్ మెరిట్ లిస్టులను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ కార్యదర్శి డా. క్రిస్టినా జడ్ చోంగ్తూ, మెడికల్ బోర్డు అధికారులు పాల్గొన్నారు. మొత్తంగా ఈ పోస్టులకు 24,045 మంది దరఖాస్తు చేసుకోగా.. గతేడాది నవంబర్ 10న జరిగిన సీబీటీ పరీక్షకు 23,323 మంది హాజరయ్యారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను పూర్తి చేసిన అనంతరం తాజాగా బోర్డు 1260 మందితో తుది ఎంపిక జాబితాను విడుదల చేసింది. దివ్యాంగుల కేటగిరీకి సంబంధించిన కేసు హైకోర్టులో కొనసాగుతుండటంతో నాలుగు పోస్టులను ఖాళీగా ఉంచింది. అలాగే, స్పోర్ట్స్ కేటగిరీలో ఉన్న 18 పోస్టులకు సెలక్షన్ జాబితాను



వేరేగా విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని బోధనాస్పత్రులు, జిల్లా/ఏరియా ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రుల్లో ఈ పోస్టులను భర్తీ చేస్తున్నారు.

# బిహార్ కొత్త ఎమ్మెల్యేలు.. 40 శాతం మందికి డిగ్రీ లేదట!

బిహార్‌లో ఇటీవల నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేల్లో దాదాపు 40 శాతం మందికి కాలేజీ డిగ్రీ లేదట. 243 మంది కొత్త శాసనసభ్యుల్లో దాదాపు 12 శాతం మంది మహిళలు ఉన్నారని, గత ఎన్నికలతో పోలిస్తే ఇది స్వల్పంగా పెరిగిందని 'పీఆర్‌ఎస్ లెజిస్లిటివ్ రీసెర్చ్' సంస్థ తన నివేదికలో వెల్లడించింది. మొత్తం 192 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు పోటీ చేయగా.. 111 మంది (58 శాతం) మళ్లీ గెలిచినట్లు తెలిపింది.

* మొత్తం 243 మంది కొత్త ఎమ్మెల్యేల్లో 40 శాతం మందికి కాలేజీ డిగ్రీ లేదు. దాదాపు 32 శాతం మంది గ్రాడ్యుయేట్లు ఉన్నారు. 2020లో డిగ్రీలు కలిగి ఉన్నవారితో (40 శాతం)తో పోలిస్తే ఈసారి తగ్గారు. 28 శాతం మంది పీజీ చేశారు. 40 శాతం మంది హయ్యర్ సెకండరీ స్థాయి వరకు చదువుకున్నారు.
* ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో 29 మంది మహిళలు ఎమ్మెల్యేలుగా గెలిచారు. 2020లో ఈ సంఖ్య 26గా ఉంది. 29 మంది నూతన మహిళా శాసనసభ్యుల్లో 15 మందికి డిగ్రీ లేదు.
* 55 ఏళ్లు, అంతకన్నా ఎక్కువ వయసున్న ఎమ్మెల్యేల సంఖ్య ఈసారి పెరిగింది. వీరి సంఖ్య 46 శాతంగా ఉంది. 2020లో 40 శాతం, 2015లో 34 శాతంగానే ఉంది. మహిళా ఎమ్మెల్యేల్లో 13మంది 25-39 ఏళ్లలోపు, తొమ్మిది మంది 40-54 ఏళ్లలోపువారు ఉన్నారు.



* 60 శాతం మంది ఎమ్మెల్యేలు రాజకీయాలు, సామాజిక సేవను తమ వృత్తిగా పేర్కొనగా.. 45 శాతం మంది వ్యవసాయం, 31 శాతం మంది వ్యాపారం, కేవలం అయిదు శాతం మంది వేతన జీవులుగా తమ అఫిడవిట్ ద్వారా వెల్లడించారు.



## రన్‌వే పైనుంచి జారిన విమానం.. చెలరేగిన మంటలు

ఆఫ్రికా దేశం కాంగో (డీఆర్‌సీ)లో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. ఓ మంత్రితోపాటు ఆయన ప్రతినిధి బృందం ప్రయాణిస్తున్న విమానం కోల్వేజీ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా రన్‌వే పైనుంచి జారిపోయింది. కాసేపటికే అందులోంచి మంటలు చెలరేగాయి. అయితే, ఎటువంటి ప్రాణనష్టం చోటుచేసుకోలేదని అధికారులు తెలిపారు.లువాలాబా ప్రావిన్స్ కలాండో సైట్‌లోని ఓ రాగి గనిలో శనివారం వంతెన కూలిపోయిన ఘటనలో దాదాపు 32 మంది మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఘటనా స్థలాన్ని పరిశీలించేందుకు గనులశాఖ మంత్రి లూయి వాటమ్ కబాంబ, ఆయన ప్రతినిధి బృందంతో కలిపి దాదాపు 20 మంది.. దేశ రాజధాని కిన్హాసా నుంచి లువాలాబా ప్రావిన్స్‌లోని కోల్వేజీకి విమానంలో బయల్దేరారు. కోల్వేజీ ఎయిర్‌పోర్ట్‌లో దిగుతుండగా.. ప్రమాదవశాత్తు రన్‌వే పైనుంచి జారిపోయింది. కాసేపటికే విమానం మంటల్లో చిక్కుకుంది. అప్పటికే విమానం నుంచి మంత్రి సహా 20 మంది సురక్షితంగా బయటకు వచ్చేశారని అధికారులు తెలిపారు. కాంగోలోని చాలా మంది ప్రజలకు ఈ రాగి మైనింగ్ జీవనాధారం. కనీసం 15-20 లక్షల మంది కలాండో సైట్‌లోని ఈ గని ద్వారా ఉపాధి పొందుతున్నారు. పరోక్షంగా లక్షలాది దీని మీద ఆధారపడి బతుకుతున్నారు. కనీస భద్రతా చర్యలు లేకపోవడంతో గతంలో ఈ గనిలో ప్రమాదాలు జరిగి చాలా మంది ప్రాణాలు కోల్పోయారు.

## ఉగ్రదాడులకు సాంకేతిక సాయం..
# దిల్లీ పేలుడు కేసులో సహ కుట్రదారుడి అరెస్టు

దిల్లీ పేలుడు కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా మరో నిందితుడు జసిర్ బిలాల్ వనీ ఎలియాస్ డానిష్‌ను శ్రీనగర్‌లో అరెస్టు చేసింది. పేలుడు కేసులో కీలక నిందితుడు, ఆ సమయంలో కారు నడిపిన డా.ఉమర్ నబీతో కలిసి జసిర్ పనిచేశాడని, ఈ ఘటన వెనుక సహ కుట్రదారుగా క్రియాశీలకంగా వ్యవహరించాడని తెలిపింది. ఉమర్‌ను 'సూసైడ్ బాంబర్'గా అధికారికంగా పేర్కొంది. జమ్మూకశ్మీర్ అనంత్‌నాగ్‌లోని ఖాజీగుండ్‌కు చెందిన జసిర్.. ఉగ్రదాడుల కోసం డ్రోన్లలో మార్పులు చేర్పులు చేసేందుకు సాంకేతిక సాయం అందించాడని, రాకెట్ల తయారీకీ యత్నించాడని ఎన్ఐఏ ఓ ప్రకటనలో తెలిపింది. ఎర్రకోట సమీపంలో పేలుడు ఘటనలో సహ కుట్రదారుడిగా వ్యవహరించాడని, ఈ దాడి ప్లాన్‌లో ఉమర్‌తో కలిసి పనిచేశాడని పేర్కొంది. ఉగ్ర కుట్ర కేసులో అరెస్టైన నిందితుల సమాచారం ఆధారంగా శ్రీనగర్ పోలీసులు ఇదివరకే జాసిర్‌ను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. తాను గత ఏడాది అక్టోబర్‌లో కుల్గాంలో ఉగ్ర నెట్‌వర్క్ సభ్యులను కలిశానని, అక్కడి నుంచి తనను అల్ ఫలా విశ్వవిద్యాలయంలోని అద్దె వసతి గృహానికి తీసుకెళ్లారని జాసిర్ తెలిపాడు. ''నన్ను 'జైషే మహమ్మద్' ఉగ్రసంస్థకు సహాయకుడిగా (ఓవర్ గ్రౌండ్ వర్కర్)గా ఉంచాలని టెర్రర్ మాడ్యూల్‌లోని ఇతర సభ్యులు కోరుకున్నారు. కానీ, ఉమర్ మాత్రం నన్ను ఆత్మాహుతి బాంబర్‌గా మారేలా ఒప్పించేందుకు చాలా నెలలు ప్రయత్నించాడు'' అని జాసిర్ చెప్పాడు. అయితే.. వివిధ కారణాలతో జాసిర్ వెనక్కి తగ్గడంతో ఆ ప్రణాళిక కార్యరూపం దాల్చలేదు. పేలుడు వెనుక కుట్రను ఛేదించేందుకు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నట్లు ఎన్ఐఏ తెలిపింది. ఇందులో భాగంగా తమ బృందాలు అనేక ఆధారాలను పరిశీలిస్తున్నాయని, ఉగ్రదాడిలో భాగమైన ప్రతి ఒక్కరినీ గుర్తించేందుకు ఆయా రాష్ట్రాల్లో తనిఖీలు చేపడుతున్నాయని వెల్లడించింది. మరోవైపు.. ఈ కేసులో ఇప్పటికే అరెస్టైన అమీర్ రషీద్ అలీని దిల్లీ కోర్టు 10 రోజుల 'ఎన్ఐఏ' కస్టడీకి అప్పగించింది.



*** జసిర్ తండ్రి నిప్పంటించుకుని ఆత్మహత్య!**

ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు తొలుత జసిర్‌తోపాటు అతడి తండ్రి, డ్రైఫ్రూట్స్ విక్రేత బిలాల్ అహ్మద్ వనీని కూడా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బిలాల్‌ను విడిచిపెట్టారు. ఆదివారం ఆయన తనకు తాను నిప్పంటించుకోవడంతో.. తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

## ఉగ్రవాదులకు మద్దతు కొనసాగిస్తే.. తీవ్ర పరిణామాలు: పాక్‌కు ద్వివేదీ హెచ్చరిక

పాకిస్థాన్‌కు భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది తీవ్ర హెచ్చరికలు చేశారు. ఉగ్రవాదులను, వారి మద్దతుదారులను భారత్ ఒకే విధంగా పరిగణిస్తుందని.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. పాకిస్థాన్‌తో వ్యవహరించే విషయంలో భారత ప్రభుత్వం కొత్త విధానాలను అనుసరిస్తున్నట్లు తెలిపారు. భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటున్న ఉగ్రవాద గ్రూపులకు మద్దతును కొనసాగిస్తే పాక్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉగ్రవాద మూలాలను ఎగదోయడం మానుకోకుంటే ఆ దేశ అస్థిత్వమే ప్రమాదంలో పడుతుందన్నారు. భారత ప్రభుత్వం ఎప్పుడూ దేశ ప్రజల పురోగతి, శ్రేయస్సుపై దృష్టి పెడుతుందని.. తన మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే, దీటుగా స్పందిస్తుందని జనరల్ ద్వివేది అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌లో ఉగ్రవాద స్థావరాల ఉనికి గురించి ప్రపంచానికి ఆధారాలు అందించామన్నారు. చర్చలు, ఉగ్రవాదం ఎన్నటికీ కలిసి సాగవని.. రక్తం, నీరు కలిసి ప్రవహించబోవని పాక్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. ప్రస్తుతం బ్లాక్‌మెయిళ్లకు భయపడే స్థితిలో భారత్ లేదని.. శత్రువులను ఎదుర్కోవడానికి దేశంలోని నేతలంతా ఒక్కతాటిపై పని చేస్తున్నారన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితి మెరుగుపడిందన్నారు. ఇంతకు ముందుతో పోల్చితే పొరుగు దేశమైన చైనాతో భారత్ సంబంధాలు బలపడుతున్నాయని ద్వివేది పేర్కొన్నారు. సరిహద్దుల నిర్వహణపై తాజాగా ఇరుదేశాల మధ్య ఉన్నతస్థాయి చర్చలు జరిగినట్లు తెలిపారు. సైనిక, దౌత్య మార్గాల్లో లోతైన చర్చలు జరిపేందుకు.. భారత్ చైనా సరిహద్దు ప్రాంతాల్లో శాంతియుత పరిస్థితులు కొనసాగించేందుకు ఇరుదేశాలు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.



## ఆయుధ నిల్వల ఆరోపణలు.. బెంగాల్ రాజ్‌భవన్‌లో తనిఖీలు

పశ్చిమ బెంగాల్ రాజ్‌భవన్ ప్రాంగణంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని నిల్వ చేశారంటూ టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ చేసిన ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. వీటిని తీవ్రంగా పరిగణించిన గవర్నర్ సీవీ ఆనంద బోస్.. సోమవారం రాజ్‌భవన్‌లో భద్రతా సిబ్బందితో తనిఖీలు చేయించారు. ''ఆయుధాలు, మందుగుండు సామగ్రిని నిల్వ చేశారా? అని గుర్తించేందుకు కోల్‌కతా పోలీసులు, కేంద్ర బలగాలు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో కూడిన బృందానికి గవర్నర్ బోస్ నేతృత్వం వహించారు'' అని ఓ అధికారి మీడియాకు తెలిపారు.

**వివాదం ఎక్కడ మొదలైందంటే..**

ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' కొనసాగుతోంది. ఎన్నికల ప్రక్రియను ప్రక్షాళన చేసేందుకు 'ఎస్ఐఆర్' ఎంతో అవసరమని శనివారం గవర్నర్ వ్యాఖ్యానించారు. ఇది జరిగిన గంటల వ్యవధిలోనే గవర్నర్, రాజ్‌భవన్‌ను టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ లక్ష్యంగా చేసుకున్నారు. ''రాజ్‌భవన్ లోపల భాజపా నేరస్థులకు గవర్నర్ ఆశ్రయం కల్పించారు. వారికి బాంబులు, తుపాకులు సమకూర్చారు'' అని తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో గవర్నర్.. ఉత్తర బెంగాల్‌లో తన పర్యటనను కుదించుకుని రాజ్‌భవన్‌కు తిరిగి వచ్చారు. ఈ క్రమంలోనే తనిఖీలకు నేతృత్వం వహించారు. ''సోదాల కోసం రాజ్‌భవన్ ప్రాంగణాన్ని ఖాళీ చేయించారు. పోలీస్ అవుట్ పోస్ట్ వద్ద కూడా సిబ్బందిని మోహరించారు. వివిధ విభాగాల అధికారులు కూడా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. గవర్నర్ వెంట జర్నలిస్టులతోపాటు ప్రముఖులు ఉన్నారు. ఇదంతా ప్రత్యక్ష ప్రసారం చేయించారు'' అని సంబంధిత అధికారి తెలిపారు. బెనర్జీ ఆరోపణలపై చట్టపరమైన అభిప్రాయం కోరినట్లు గవర్నర్ బోస్ ఇప్పటికే తెలిపారు. మరోవైపు.. ఈ వ్యవహారంపై తాను కోర్టులో పోరాటానికి సిద్ధంగా ఉన్నానని, తనను బెదిరించలేరని ఎంపీ కల్యాణ్ బెనర్జీ స్పష్టం చేశారు.



## హైదరాబాద్‌లో అల్ ఫలాహ్ యూనివర్సిటీ ఛైర్మన్ సోదరుడి అరెస్ట్

మహూ: దిల్లీ పేలుడు కేసులో విచారణ ఎదుర్కొంటున్న అల్ ఫలాహ్ యూనివర్సిటీ ఛైర్మన్ జావెద్ సిద్దిఖీ సోదరుడిని మధ్యప్రదేశ్ పోలీసులు అరెస్ట్ చేశారు. 25 ఏళ్ల క్రితం మధ్యప్రదేశ్‌లోని మహూ ప్రాంతంలో జరిగిన ఆర్థిక మోసం కేసులో నిందితుడైన అతణ్ని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు.

**భారీ మోసం**

అరెస్ట్ అయిన వ్యక్తి పేరు హమూద్ అహ్మద్ సిద్దిఖీ. దాదాపు 25 ఏళ్ల క్రితం మహూలో ఒక నకిలీ ప్రైవేట్ బ్యాంకును స్థాపించాడు. ప్రజల డబ్బును రెట్టింపు చేస్తామని నమ్మబలికాడు. వందలాది మంది ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించాడు. ఈ స్కామ్ బయటపడగానే 2000వ సంవత్సరంలో తన కుటుంబంతో సహా మహూ నుంచి పరారయ్యాడు. అప్పటి నుంచి పోలీసులు అతడి కోసం గాలిస్తున్నారు. మహూ సబ్ డివిజనల్ ఆఫీసర్ ఆఫ్ పోలీస్ లలిత్ సింగ్ సికర్వార్ ప్రకారం.. హమూద్‌ను ఆదివారం హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. అతను లో ప్రొఫైల్‌ను మెయింటైన్ చేస్తూ షేర్ ట్రేడింగ్ చేస్తున్నాడు.




**జావెద్ సిద్దిఖీ లింక్**

దిల్లీ పేలుడు కేసు విచారణలో భాగంగా పోలీసులు జావెద్ సిద్దిఖీ పూర్వాపరాలను పరిశీలించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో హమూద్‌పై చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మోసం కేసు వివరాలు బయటపడ్డాయి.

# సీఎం మార్పు ప్రచారం వేళ.. దిల్లీలో సిద్ధూడీకే

కర్ణాటకలో కొంతకాలంగా సీఎం మార్పుపై ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నాయి. నవంబర్‌లో ఆ మార్పు ఉండొచ్చన్న వార్తలు ఆగడం లేదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ దిల్లీలో కనిపించారు. వారిద్దరూ దేశ రాజధానిలోని కర్ణాటక భవన్‌కు వెళ్లారు. బిహార్ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కర్ణాటక రాజకీయాల్లో మార్పులు, చేర్పులు ఉంటాయని మొదటి నుంచి ప్రచారం జరుగుతోంది. పార్టీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీతో సిద్ధు భేటీ అయ్యారు. కర్ణాటక ముఖ్యమంత్రిగా తానే పూర్తి కాలం కొనసాగేందుకు అవకాశం ఇవ్వాలని పరోక్షంగా అధిష్ఠానాన్ని కోరిన సిద్ధరామయ్య.. తదుపరి (2028) ఎన్నికలకు శివకుమార్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రతిపాదిద్దామని సూచించినట్లు సమాచారం. మరోవైపు పార్టీ అధిష్ఠానం తనను ఏ విషయమైనా అడిగేంత వరకు మౌనంగా ఉండాలని శివకుమార్ భావిస్తున్నారు. ఇదిలా ఉంటే.. కర్ణాటక మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సిద్ధరామయ్య భేటీ కానున్నారు. ఖర్గే నివాసంలో వీరు సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. క్యాబినెట్ విస్తరణపైనే ఆయన చర్చిస్తారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, ఆదివారం డీకే, ఖర్గే భేటీ అయ్యారు. ''పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ అధ్యక్షుడు సమావేశం కావడం సర్వసాధారణం. ఇందులో కొత్తేమీ లేదు. పార్టీకి సంబంధించిన అంశాలనే మాట్లాడుకున్నాం'' అని ఊహాగానాలను డీకే తోసిపుచ్చారు. ఒకవేళ క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణకు అధిష్ఠానం ఆమోదం తెలిపితే.. సిద్ధరామయ్య పూర్తికాలం సీఎంగా కొనసాగేందుకు అనుమతి లభించినట్లేనని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యమంత్రి స్థానాన్ని డీకేకు అప్పగించినా, అప్పగించకపోయినా, కర్ణాటకలో మధ్యంతర ఎన్నికలు వస్తాయని విపక్ష నేత ఆర్.అశోక్ ధీమా వ్యక్తం చేశారు. ముందుగా చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేసేందుకు సిద్ధరామయ్య సుముఖంగా లేకపోవడంతో డీకే శివకుమార్‌కు ఏం చేయాలో పాలుపోవడం లేదన్నారు. సిద్ధును పీఠం నుంచి తప్పించడం తేలికైన విషయం కాదన్నారు.



**మోదీతో భేటీ కానున్న సిద్ధరామయ్య..** దిల్లీలో ఉన్న సిద్ధరామయ్య ప్రధాని మోదీతో కూడా భేటీ కానున్నారు. చెరకు రైతుల సమస్యలు, రాష్ట్ర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అనుమతులపై చర్చించనున్నట్లు తెలుస్తోంది.

## బిహార్ సీఎం నీతీశ్‌కుమారే.. వెల్లడించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు

బిహార్ ముఖ్యమంత్రిగా మరోసారి నీతీశ్ కుమార్ బాధ్యతలు తీసుకోనున్నారు. ఆయనే సీఎంగా కొనసాగుతారని సోమవారం భాజపా రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ జైశ్వాల్ వెల్లడించారు. దీనిపై ఎన్డీయే భాగస్వామ్యపక్షాల నుంచి అధికారిక స్పందన రావడమే మిగిలిఉందన్నారు. మరోవైపు నీతీశ్ తన రాజీనామాను గవర్నర్‌కు అందించారు. మంగళవారం ఉదయం రాష్ట్ర కార్యాలయంలో భాజపా శాసనసభాపక్ష సమావేశం జరగనుందని జైస్వాల్ వెల్లడించారు. తర్వాత ఎన్డీయే శాసనసభాపక్షం సమావేశం అవుతుందని, అక్కడ నీతీశ్ ఎంపికకు సంబంధించిన లాంఛనాలు పూర్తి చేస్తామని వెల్లడించారు. గాంధీ మైదాన్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం కోసం ప్రణాళికలు వేస్తున్నట్లు వెల్లడించారు. దానికి ప్రధాని మోదీతో పాటు భాజపా పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నట్లు తెలుస్తోంది.




## భారత్-అమెరికా చర్చలే కీలకం..
# 'స్టాక్ మార్కెట్'పై నిపుణుల విశ్లేషణ



ముంబయి: వచ్చేవారం స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేయనున్న అంశాలను ఆర్థిక నిపుణులు అంచనా వేశారు. భారత్ అమెరికా మధ్య జరుగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చల్లోని పురోగతి ఆధారంగా సూచీలు కదిలే అవకాశం ఉన్నట్లు తెలిపారు. అలాగే 'పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్' డేటా, అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశ వివరాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధానికి చేరుకున్న నేపథ్యంలో మదుపర్లు తమ పోర్ట్‌ఫోలియోలను సమీక్షించుకునే అవకాశం ఉందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ ప్రతినిధి వినోద్ నాయర్ తెలిపారు. ఈ క్రమంలో కంపెనీ ఫలితాలను నిశితంగా పరిశీలిస్తారన్నారు. ఫండమెంటల్స్ బలంగా ఉన్న రంగాల్లోకి ఇన్వెస్ట్‌మెంట్లు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. గతవారం దేశీయ మార్కెట్ సూచీలు బలంగా ముగిసిన విషయాన్ని గుర్తుచేశారు. అమెరికాలో 'షట్‌డౌన్' ముగియడం, రెండో త్రైమాసిక ఫలితాలు అంచనాలను మించడం కలిసొచ్చిందని విశ్లేషించారు. బిహార్‌లో ఎన్‌డీయే ప్రభుత్వానికి భారీ మెజారీ లభించడం కూడా మార్కెట్లను చివర్లో ప్రభావితం చేసినట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లోని రీసెర్చ్ విభాగాధిపతి సిద్దార్థ ఖేమ్కా తెలిపారు. అలాగే రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం, 'సిప్'లు పెరగటంతో పాటు ఐపీవోలు కూడా సూచీలకు మద్దతుగా నిలిచినట్లు విశ్లేషించారు. వచ్చేవారం కూడా మార్కెట్లు పాజిటివ్‌గా ట్రేడ్ అవుతాయని అంచనా వేశారు. రిజల్ట్స్ సీజన్ ముగిసిన నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఇతర అంశాలపై దృష్టి సారించే అవకాశం ఉందన్నారు. పండగ సీజన్ తర్వాత నుంచి డిమాండ్ పుంజుకోవడం, వడ్డీ రేట్లు, ద్వితీయార్థంలో ప్రభుత్వ మూలధన వ్యయం వంటి అంశాలను పరిశీలించొచ్చని విశ్లేషించారు. గతవారం స్టాక్ మార్కెట్ సూచీలు బలంగా క్లోజ్ అయ్యాయి. నిఫ్టీ 50 సూచీ వారం మొత్తంలో ఏకంగా 413 పాయింట్లు పెరిగి 25,910 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 1,455 పాయింట్లు లాభపడి 84,562 దగ్గర స్థిరపడింది.

## ఎస్‌బీఐ కస్టమర్లకు అలర్ట్..
# డిసెంబర్ 1 నుంచి ఆ సర్వీస్ బంద్




ముంబయి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) తమ కస్టమర్లను అలర్ట్ చేసింది. mCASH సర్వీస్ ద్వారా డబ్బు పంపడం, క్లెయిమ్ చేసుకునే సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. 2025 నవంబర్ 30 తర్వాత ఇది అమల్లోకి రానుంది. ఆ తేదీ తర్వాత కస్టమర్లు ఆన్‌లైన్ ఎస్‌బీఐ (On lineSBI), యోనో లైట్ (YONO Lite) ద్వారా mCASH సేవను వాడుకోలేరు. బెనిఫిషియరీని రిజిస్టర్ చేయకుండా డబ్బు పంపడం లేదా mCASH లింక్ ద్వారా ఆ డబ్బును క్లెయిమ్ చేసుకోవడం లాంటివి ఇకపై కుదరవు.

**ఏంటీ mCASH?**

mCASH ఒకప్పుడు ఎస్‌బీఐ కస్టమర్లకు చాలా సౌకర్యవంతంగా ఉండేది. ఇంటర్నెట్ బ్యాంకింగ్ వాడుతున్న కస్టమర్లు..ఎవరికైనా డబ్బు పంపాలనుకుంటే వారు ముందుగా బెనిఫిషియరీగా రిజిస్టర్ చేసుకోవాల్సిన అవసరం ఉండేది కాదు. బదులుగా, కేవలం డబ్బు అందుకునే వ్యక్తి మొబైల్ నెంబర్ లేదా ఈమెయిల్ ఐడీని ఉపయోగించి సులభంగా డబ్బు పంపేవారు. డబ్బు అందుకునే వ్యక్తికి (రిసీవర్) ఒక ఎస్సెమ్మెస్ లేదా ఈమెయిల్ రూపంలో ఎనిమిది అంకెల పాస్‌కోడ్ ఉండే సురక్షితమైన లింక్ వచ్చేది. ఆ లింక్ ద్వారా లేదా ఎస్‌బీఐ mCASH మొబైల్ యాప్ ద్వారా వారు ఏ బ్యాంకు అకౌంట్‌లో అయినా ఆ డబ్బును క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉండేది.

**మరి ఎలా?**

mCASH సేవలు నిలిచిపోతున్నందున కస్టమర్లు థర్డ్‌పార్టీ వ్యక్తులకు డబ్బు పంపడానికి ఇతర సురక్షితమైన, విస్తృతంగా అందుబాటులోకి వచ్చిన డిజిటల్ పద్ధతులకు మారాలని ఎస్‌బీఐ సూచించింది. ఇందుకోసం యూపీఐ (UPI), ఐఎంపీఎస్ (IMPS), నెఫ్ట్ (NEFT), ఆర్టీజీఎస్ (RTGS) వంటి ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా ఎస్‌బీఐ కస్టమర్లు తమ 'భీమ్ ఎస్‌బీఐ పే' (BHIM SBI Pay) యూపీఐ యాప్‌ను ఉపయోగించి సులభంగా డబ్బు పంపవచ్చు.

**'భీమ్ ఎస్‌బీఐ పే' యాప్**

యూపీఐ ద్వారా డబ్బు పంపే విధానం చాలా సులభం. మొదట 'BHIM SBI Pay' యాప్‌లోకి లాగిన్ అవ్వాలి. తర్వాత 'Pay' అనే ఆప్షన్ ఎంచుకుని, VPA (Virtual Payment Address) లేదా అకౌంట్ నెంబర్ ఇంకా IFSC కోడ్ లేదా QR కోడ్ వంటి ఏదైనా ఒక పద్ధతిని సెలక్ట్ చేసుకోవాలి. అవసరమైన వివరాలు ఎంటర్ చేయాలి. తర్వాత, మీరు డబ్బు పంపాలనుకుంటున్న అకౌంట్ ఎంచుకోవాలి. యూపీఐ పిన్ ఎంటర్ చేస్తే ట్రాన్సాక్షన్ పూర్తవుతుంది. mCASH ఆగిపోయినా కస్టమర్లు ఎలాంటి ఇబ్బంది లేకుండా డిజిటల్ చెల్లింపులు కొనసాగించొచ్చు.

# నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..?

మన ఇంట్లో ఏ చిన్న శుభకార్యం జరిగినా బంగారం కొనుగోలు చేస్తుంటాము. ఇక అందులోనూ మన దేశంలో గోల్డ్‌కి మరింత పాపులారిటీ ఎక్కువ. ఇక ఈ మధ్య కాలంలో బంగారం ధరల్లో హెచ్చు తగ్గులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒకరోజు రేట్లు తగ్గి కాస్త ఊరటనిస్తుంటే మరోరోజు పెరిగి అమ్మో అనిపిస్తున్నాయి. ఈ క్రమంలో నేడు బంగారం ధరలు స్థిరంగా ఉన్నాయి. ఇక ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడలో 22 క్యారెట్ల బంగారం ధర నేడు రూ.1,14,650గా ఉంది. అలాగే 24 క్యారెట్ల బంగారం ధర నేడు రూ.1,25,080కు చేరుకుంది. ఇక అటు వెండి ధర రూ.100 పెరిగి కిలో రూ.1,75,000గా ఉంది. కాగా దాదాపు రెండు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు ఇవే ఉన్నాయి.



## చెలరేగిన భారత్‌ఎ బౌలర్లు..
# దక్షిణాఫ్రికా-ఎ 132 ఆలౌట్




రాజ్‌కోట్: భారత్‌ఎ, దక్షిణాఫ్రికా-ఎ మధ్య మూడు మ్యాచ్‌ల అనధికార వన్డే సిరీస్ జరుగుతున్న సంగతి తెలిసిందే. తొలి వన్డేలో భారత్‌ఎ గెలవగా నేడు రెండో మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాఎ 30.3 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌటైంది. రివాల్డో మూన్సామి (33; 34 బంతుల్లో) టాప్ స్కోరర్. డెలానో పోట్గీటర్ (23), డయాన్ ఫారెస్టర్ (22), లువాన్‌డ్రే ప్రిటోరియస్ (21), ప్రేనేలన్ సుబ్రాయెన్ (15) పరుగులు చేశారు. భారత బౌలర్లలో నిషాంత్ సింధు (4/16), హర్షిత్ రాణా (3/21) మెరిశారు. ప్రసిద్ధ్ కృష్ణ 2, తిలక్ వర్మ ఒక వికెట్ పడగొట్టారు.




# డెఫ్లంపిక్స్‌లో హైదరాబాద్ షూటర్‌కి స్వర్ణం

టోక్యో వేదికగా జరుగుతున్న డెఫ్లంపిక్స్‌లో హైదరాబాద్‌కు చెందిన షూటర్ ధనుష్ శ్రీకాంత్ సత్తా చాటాడు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పురుషుల విభాగంలో స్వర్ణం సాధించాడు. సూరత్‌కు చెందిన మరో షూటర్ మహ్మద్ వానియా రజత పతకం సొంతం చేసుకున్నాడు. దీంతో రెండు పతకాలూ భారత్‌కే దక్కినట్లైంది.




## 'మూడు'తో ఆటలా?
# టెస్టుల్లో కీలక స్థానంపై ప్రయోగాలు!





టెస్టు క్రికెట్లో మూడో నంబర్ బ్యాటింగ్ స్థానం ఎంతో కీలకమైంది. జట్టులోని అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిని ఆ స్థానంలో ఆడిస్తారు. ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేయడం, ముందుకు నడిపించడంలో ఈ స్థానంలో ఆడే బ్యాటర్ ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుంది. అలాంటి స్థానం విషయంలో జట్టు యాజమాన్యం చేస్తున్న ప్రయోగాలు విమర్శలకు దారి తీస్తున్నాయి. టెస్టుల్లో టీమ్‌ఇండియాకు మూడో నంబర్ బ్యాటర్‌గా అత్యధిక కాలం సేవలందించిన బ్యాటర్ రాహుల్ ద్రవిడ్. ఆ స్థానానికి ఎంతో విలువ చేకూర్చి, దాని ప్రాధాన్యాన్ని చాటింది ద్రవిడే. ఆరంభంలోనే ఒకట్రెండు వికెట్లు పడినపుడు.. క్రీజు చుట్టూ గోడ కట్టి పతనాన్ని అడ్డుకునేవాడు ద్రవిడ్. ఇన్నింగ్స్‌కు బలమైన పునాది పడితే.. జట్టును భారీ స్కోరు దిశగా నడిపించేవాడు. ద్రవిడ్ తర్వాత చెతేశ్వర్ పుజారా పదేళ్లకు పైగా ఆ బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాడు. కానీ పుజారా టెస్టు జట్టుకు దూరమయ్యాక ఆ స్థానాన్ని సరైన ఆటగాడితో భర్తీ చేయలేక భారత్ ఇబ్బంది పడుతోంది. మిగతా స్థానాల విషయంలో ఇబ్బంది లేదు కానీ.. కీలకమైన మూడో నంబరులో మాత్రం ఎవ్వరూ నిలదొక్కుకోలేకపోతున్నారు. పుజారాపై వేటు పడ్డాక కొంత కాలం శుభ్‌మన్ గిల్ ను ఆ స్థానంలో ఆడించారు. అతను ఓ మోస్తరు ప్రదర్శన చేశాడు. అయితే ఈ ఏడాది రోహిత్, కోహ్లి టెస్టుల నుంచి రిటైరైపోయాక శుభ్‌మన్ స్థానం మారిపోయింది. రోహిత్ స్థానంలో జట్టు పగ్గాలందుకున్న అతను.. కోహ్లి ఆడే నాలుగో స్థానంలోకి మారాడు. ఇంగ్లాండ్ పర్యటన నుంచి ఆ నంబరులోనే ఆడుతున్నాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో మూడో స్థానంలో కరుణ్ నాయర్, సాయి సుదర్శన్‌లను మార్చి మార్చి ఆడించారు. కానీ ఇద్దరూ అవకాశాలను ఉపయోగించుకోలేకపోయారు.

సొంతగడ్డపై వెస్టిండీస్‌తో సిరీస్‌కు కరుణ్‌పై వేటు పడింది. సుదర్శన్‌కు ఛాన్స్ వచ్చింది. అతనే మూడో స్థానంలో ఆడాడు. రెండో టెస్టులో 87, 39 పరుగులతో సత్తా చాటాడు. దీంతో ఇక అతనే మూడో స్థానంలో కొనసాగుతాడనిపించింది.

**ఇది సరైందేనా?**

ప్రపంచ టెస్టు ఛాంపియన్ దక్షిణాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్ ఆరంభమైంది. తొలి మ్యాచ్‌కు తుది జట్టు ఎంపిక విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ పెద్ద షాకే ఇచ్చింది. ఆరుగురు బౌలర్లను ఎంచుకుని, స్పెషలిస్టు బ్యాటర్లను అయిదుగురికి పరిమితం చేసింది. ఈ క్రమంలో మూడో స్థానంలో ఆడే సాయి సుదర్శన్ మీద వేటు వేసింది. పంత్‌కు తోడు మరో వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్‌కు అవకాశమిచ్చింది. జురెల్ సూపర్ ఫామ్‌లో ఉండడంతో అతణ్ని ఆడించక తప్పలేదు. అయితే ఇందుకోసం కీలకమైన మూడో నంబర్ బ్యాటర్ మీద వేటు వేసి.. బౌలింగ్ ఆల్‌రౌండరైన వాషింగ్టన్ సుందర్‌ను ఆడించడం విమర్శలకు దారి తీసింది. ఈ ప్రయోగాన్ని చాలామంది తప్పుబట్టారు. మాజీ పేసర్ దొడ్డ గణేష్.. కెప్టెన్ శుభ్‌మన్, కోచ్ గంభీర్‌ల తీరును దుయ్యబట్టాడు. గత మ్యాచ్‌లో రాణించిన సుదర్శన్‌ను ఎలా పక్కన పెడతారని.. టెస్టుల్లో ఎంతో కీలకమైన మూడో స్థానంలో ఈ ఆటలేంటని ప్రశ్నించాడు. ఈ మ్యాచ్‌లో సుందర్ కీలకమైన 60 పరుగులు (29 +31) చేసినా ఒక స్థిరమైన బ్యాటర్‌ను ఆ స్థానానికి తీర్చిదిద్దుకోకుంటే భవిష్యత్తులో, ముఖ్యంగా విదేశీ పర్యటనల్లో ఇబ్బందులు తప్పవనే చర్చ జరుగుతోంది. మరి గంభీర్, శుభ్‌మన్ ఇకముందూ మూడో స్థానంలో ఇలా మార్పులు చేస్తుంటారా.. లేక ఒక బ్యాటర్‌కు కట్టుబడతారా అన్నది చూడాలి.

# బాగా ఆడకపోతే ఇలాగే జరుగుతుంది..
## తొలి టెస్టు ఓటమిపై గంభీర్ కీలక వ్యాఖ్యలు

తొలి టెస్టులో ఓటమి అనంతరం టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ భారత బ్యాటర్లపై కీలక వ్యాఖ్యలు చేశాడు. బాగా ఆడకపోతే ఇలాగే జరుగుతుందన్నాడు. పిచ్ తాము కోరుకున్నదేనని చెబుతూ తమ బ్యాటర్లే సరిగ్గా ఆడలేదని వ్యాఖ్యానించాడు. 'మేము ఇలాంటి పిచే అడిగాం. క్యూరేటర్ మాకు సహాయం చేశాడు. ఇక్కడ పాయింట్ పిచ్ గురించి కాదు. టర్న్ ఆడటం తెలిసి ఉండాలి. పిచ్ ఎలా ఉన్నా 124 పరుగులు ఛేదించగలిగేదే. డిఫెన్స్ ఆడితే కచ్చితంగా పరుగులు చేయొచ్చు. ఈ పిచ్‌పై బిగ్ షాట్స్ ఆడలేం. కానీ, డిఫెన్స్ ఆడగలిగితే మాత్రం కచ్చితంగా రన్స్ చేసే పిచ్. బవుమా హాఫ్ సెంచరీ చేశాడు. అక్షర్, సుందర్ కూడా పరుగులు రాబట్టారు. కాబట్టి ఎప్పుడూ పిచ్ గురించి మాట్లాడటం వల్ల ఉపయోగం లేదు'అని తెలిపాడు. పిచ్ స్పిన్నర్లకు సహకరించడంపై అడిగిన ప్రశ్నకు గంభీర్ స్పందిస్తూ.. పేసర్లే ఎక్కువ వికెట్ తీశారని చెప్పాడు. స్పిన్నర్లు, పేసర్లు ఇద్దరూ ప్రభావం చూపించారన్నాడు.

# శివ వైబ్స్ క్రియేట్ చేస్తున్న నాగ్



టాకీస్: అక్కినేని నాగార్జున నటించిన ఐకానిక్ మూవీ శివ ఇటీవలే గ్రాండ్‌గా రీరిలీజ్ అయిన విషయం తెలిసిందే. రీరిలీజ్‌లో సూపర్ రెస్పాన్స్ రాబట్టుకుంది శివ. ఇక మరోసారి శివ సినిమా నాటి వైబ్స్ క్రియేట్ చేస్తున్నాడు నాగార్జున. చైన్ బ్రాస్‌లెట్‌ను అరచేతిలో మడిచి పట్టుకున్న నాగార్జున బ్లాక్ డ్రెస్‌కు మ్యాచ్ అయ్యే గాగుల్స్‌తో స్టైలిష్‌గా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై కూర్చొని కెమెరాకు ఫోజులిచ్చాడు. అయినప్పటికీ అతడి చరిష్మా శాశ్వతమైనది.. సొగసైనది.. మరపురానిది..' అనే క్యాప్షన్‌తో పోస్ట్ చేసిన తాజా స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఆరు పదుల వయస్సు దాటినా కుర్ర హీరోలకు ఏ మాత్రం తగ్గేదేలే అంటూ తాజా స్టిల్స్‌తో చెప్పకనే చెప్పేస్తున్నాడు నాగార్జున. ఈ ఏడాది కుబేర, కూలీ సినిమాలతో సూపర్ హిట్స్ అందుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగార్జున. నాగార్జున ప్రస్తుతం కెరీర్‌లో ల్యాండ్ మార్క్ సినిమాగా నిలిచిపోయే 100వ ప్రాజెక్ట్‌పై వర్క్ చేస్తున్నాడు. ఈ చిత్రాన్ని తమిళ దర్శకుడు రా కార్తీక్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీని నాగార్జున 2026 మే నెలలో సమ్మర్ కానుకగా అభిమానుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నట్టు ఇప్పటికే వార్తలు రాగా.. నాగార్జున టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.






MOVIE TIME

## చిరు-బాబీ మూవీపై క్రేజీ అప్‌డేట్..

టాకీస్: మెగాస్టార్ చిరంజీవి వరుసగా క్రేజీ ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. ఇప్పటికే మెగా158గా రూపొందుతున్న "మన శంకర వరప్రసాద్ గారు" సినిమా దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో షూటింగ్ కొనసాగుతోంది. ఆ తరువాత, దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం "విశ్వంభర" సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ రెండు చిత్రాల తరువాత చిరంజీవి, నేచురల్ స్టార్ నాని నిర్మాణంలో శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మరో ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ క్రేజీ లైనప్ తరువాత చిరంజీవి మరోసారి దర్శకుడు బాబీ కొల్లితో సినిమాకు ఓకే చెప్పారు. కేవీఎన్ సంస్థ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌కు ఇటీవలే అధికారిక ప్రకటన కూడా విడుదలైంది.

తాజాగా, ఈ చిత్రానికి సంబంధించిన ఫైనల్ స్టోరీ డ్రాఫ్ట్ పూర్తయిందని మేకర్స్ ప్రకటించారు. ఆ డ్రాఫ్ట్‌తో పాటు కోల్‌కతా భాషలో ఒక కోట్‌ను జత చేయడంతో, ఈ సినిమా కోల్‌కతా బ్యాక్‌డ్రాప్‌లో సాగే గ్యాంగ్‌స్టర్ డ్రామా అని అర్థమవుతోంది. కోల్‌కతా నేపథ్యంలో చిరంజీవి చేసిన గత సినిమా ఎలా ఇండస్ట్రీ హిట్ అయ్యిందో తెలిసిందే. అందుకే, అదే సెట్టింగ్‌లో వస్తున్న ఈ కొత్త ప్రాజెక్ట్ పైన అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. దర్శకుడు బాబీ కొల్లితో చిరంజీవి కలయికలో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. పక్కా మాస్, కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ₹236 కోట్లకు పైగా గ్రాస్ రాబట్టింది. దీంతో ఈ బ్లాక్‌బస్టర్ కాంబినేషన్ మళ్లీ రాబోతుంది.

## వచ్చే ఏడాది పెళ్లి పీటలు ఎక్కబోతున్నా

### తిరుమలలో నటుడు సాయిదుర్గతేజ్ వెల్లడి

టాకీస్: మెగా మేనల్లుడు సాయి దుర్గ తేజ్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం వివిపీ బ్రేక్‌లో ఆయన స్వామిని సేవించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఏడాది తన పెళ్లి జరుగుతుందని



క్లారిటీ ఇచ్చారు. ఎన్నో రోజులుగా పెళ్లిపై వస్తున్న రూమర్‌లకు చెక్ పెట్టారు తేజ్. 'చక్కని సినిమాలు, మంచి జీవితం ఇచ్చిన భగవంతుడికి కృతజ్ఞతలు తెలిపేందుకు తిరుమల వచ్చాను. కొత్త సంవత్సరం వస్తున్న తరుణంలో శ్రీవారి ఆశీస్సులు కావాలని దర్శించుకున్నాను. వచ్చే ఏడాదిలో నేను నటించిన 'సంబరాల ఏటిగట్టు' విడుదలవుతుంది. ప్రేక్షకులు, అభిమానులు ఆదరిస్తారని ఆశిస్తున్నా' అన్నారు. పెళ్లిపై వస్తున్న రూమర్లపై ఓ జర్నలిస్ట్ ప్రశ్నించగా.. 'వచ్చే ఏడాదిలోనే నా పెళ్లి ఉంటుంది' అని సమాధానమిచ్చారు తేజ్. 'సంబరాల ఏటిగట్టు' చిత్రాన్ని రోహిత్ కె.పి. తెరకెక్కిస్తున్నారు. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. 'తన జీవితంలో చాలా ముఖ్యమైన సినిమా ఇదని, అందరి అంచనాల్ని అందుకునేలా కష్టపడుతున్నానని సాయితేజ్ ఇటీవల ఓ వేదికపై తెలిపారు.

## నటి కీర్తి సురేశ్‌కు అరుదైన గౌరవం

- యూనిసెఫ్ ఇండియా సెలబ్రిటీ అడ్వకేట్‌గా నటి కీర్తి సురేశ్ నియామకం
- ఇది తనకు దక్కిన గొప్ప గౌరవమన్న కీర్తి
- కీర్తితో భాగస్వామ్యంపై హర్షం వ్యక్తం చేసిన యూనిసెఫ్

టాకీస్: ప్రముఖ నటి కీర్తి సురేశ్‌కు అరుదైన గౌరవం లభించింది. ఐక్యరాజ్యసమితికి చెందిన యూనిసెఫ్ (యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్) ఇండియా విభాగానికి ఆమె సెలబ్రిటీ అడ్వకేట్‌గా నియమితులయ్యారు. ఈ కొత్త బాధ్యతలు చేపట్టడం పట్ల కీర్తి సురేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ఆమె తెలిపారు. ఈ నియామకం పై యూనిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్‌కాఫ్రీ మాట్లాడుతూ.. "కీర్తి సురేశ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోవడం మాకు ఎంతో సంతోషంగా ఉంది. ప్రేక్షకులతో ఆమెకున్న బలమైన అనుబంధం, పిల్లల హక్కులు, వారి శ్రేయస్సు కోసం పోరాడటానికి బలమైన వేదిక అవుతుందని విశ్వసిస్తున్నాం" అని ఆమె పేర్కొన్నారు. అనంతరం కీర్తి మాట్లాడుతూ.. "ప్రతి చిన్నారికి సంతోషంగా, ఆరోగ్యంగా జీవించే హక్కు ఉంది. వారి నేపథ్యంతో సంబంధం లేకుండా, ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందేలా అవగాహన కల్పించేందుకు యూనిసెఫ్ ఇండియాతో చేతులు కలపడం గౌరవంగా ఉంది" అని కృతజ్ఞతలు తెలిపారు. పిల్లల శ్రేయస్సే దేశానికి పునాది అని తాను బలంగా నమ్ముతానని ఆమె వివరించారు. ఇక కీర్తి సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం ఆమె నటించిన 'రివాల్వర్ రీటా' చిత్రం ఈ నెల 28న విడుదలకు సిద్ధమవుతోంది.




## గోవాలో 20న అంతర్జాతీయ చలనచిత్రోత్సవం

### ఆరంభ వేడుకల్లో బాలయ్యకు సన్మానం

టాకీస్: ఒకప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో తెలుగు వారికి సరైన ప్రాధాన్యత లభిస్తుండేది కాదు. కానీ ఇప్పుడు కాలం మారింది. యావత్ భారత సినీ



రంగం తెలుగు వారివైపు ఆసక్తిగా చూస్తున్నాయి. తెలుగు సినిమాలే ఇవాళ జాతీయ స్థాయిలో దిశా నిర్దేశర చేస్తున్నాయి. అంతర్జాతీయ యవనికపై భారతీయ సినిమా సత్తాను చాటుతోంది కూడా తెలుగు సినిమాలే! ఈ నేపథ్యంలో తెలుగు సినిమా రంగానికి చెందిన కథానాయకులకు, దర్శకులకు అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో తగిన గుర్తింపు లభిస్తోంది. ఆ మధ్య మెగాస్టార్ చిరంజీవిని ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ వేదికపై ఘనంగా సత్కరించారు. ఇప్పుడు నందమూరి బాలకృష్ణను సత్కరించబోతున్నారు. నవంబర్ 20న గోవా లో 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం ప్రారంభం కానుంది. ఈ ఆరంభ వేడుకల్లోనే బాలకృష్ణను ఘనంగా సత్కరించబోతున్నారు. ఐదు దశాబ్దాల పాటు నందమూరి బాలకృష్ణ తెలుగు సినిమా రంగంలో హీరోగా రాణిస్తున్నారు. నందమూరి తారక రామారావు నట వారసుడిగా తెలుగు సినిమా రంగంలోకి అడుగుపెట్టిన బాలకృష్ణ మడమ తిప్పకుండా యాభై సంవత్సరాలు ముందుకు సాగుతున్నారు. ఎన్నో బ్లాక్ బస్టర్స్ ను తన ఖాతాలో వేసుకున్నారు. తెలుగు సినిమా రంగానికి ఆయన చేసిన సేవల కారణంగా ఈ సత్కారం జరుగబోతోంది. కేంద్ర ప్రభుత్వ అత్యున్నత గౌరవాల్లో ఒకటైన పద్మభూషణ్ పురస్కారాన్ని సైతం బాలకృష్ణ ఇటీవల అందుకున్నారు.

## దండోరా టీజర్ రిలీజ్



టాకీస్: విలక్షణ నటులు శివాజీ, నవదీప్, నందు, బిందు మాధవి కాంబోలో తెరకెక్కిన చిత్రం 'దండోరా' . రవి కృష్ణ, మణిక, అనూష, రాధ్య ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. అన్నికార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబర్ 25న థియేటర్లకు వచ్చేందుకు రెడీ అయింది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా సోమవారం ఉదయం ఈ చిత్రం టీజర్ రిలీజ్ చేశారు. టీజర్ చూస్తుంటే ఫక్తు తెలంగాణ మాండలికంలో వ్యంగ్యంగా తెరకెక్కించిన చిత్రంగా తెలుస్తోండగా, ముఖ్యంగా నాలుగు పుస్తకాలు చదివి లోకమంతా తెలిసినోడి లెక్క మాట్లాడకు... నీకు తెలియని లోకం ఇంకోటి ఉంది అంటూ సాగే డైలాగులు, సన్నివేశాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. మీరూ ఓ లుక్కేయండి. గతంలో నేషనల్ అవార్డ్ దక్కించుకున్న చిత్రం 'కలర్ ఫోటో',ఆపై నవ్వులు పూయించిన 'బెదురులంక 2012' చిత్రాలను నిర్మించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మాత రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ 'దండోరా' చిత్రాన్ని నిర్మించారు. మురళీ కాంత్ దర్శకత్వం వహించాడు.

## 'ఐబొమ్మ' పైరసీ వెబ్‌సైట్ క్లోజ్..

### సజ్జనార్‌ని కలిసిన టాలీవుడ్ ప్రముఖులు

టాకీస్: తెలుగు చిత్ర పరిశ్రమను ఏళ్లుగా తీవ్రంగా ఇబ్బంది పెట్టిన పైరసీ ముఠా 'ఐబొమ్మ'కు పెద్ద దెబ్బ పడింది. ఈ వెబ్‌సైట్ ప్రధాన సూత్రధారి ఇమ్మడి రవిని పోలీసులు అరెస్ట్ చేయడంతో సినీ ఇండస్ట్రీ ఊపిరి పీల్చుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో సోమవారం మెగాస్టార్ చిరంజీవి, కింగ్ నాగార్జున, అగ్ర నిర్మాత దిల్ రాజు హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సిటీ పోలీస్ కమిషనర్ బీసీ సజ్జనార్‌ను ప్రత్యేకంగా కలిసి చర్చించారు. ఈ సమావేశంలో ఐబొమ్మ పైరసీ నెట్‌వర్క్ గురించిన కీలక అంశాలు ముందుకు వచ్చాయి. ఆ తరువాత మీడియాతో



మాట్లాడిన కమిషనర్ సజ్జనార్ సంచలన వివరాలు వెల్లడించారు. "పైరసీ దేశవ్యాప్త సమస్య. దీనివల్ల ఫిల్మ్ ఇండస్ట్రీకి వేల కోట్ల నష్టం జరిగింది. చాలా కాలంగా ఎదురుచూసిన ప్రధాన నిందితుడు ఇమ్మడి రవిని ఎట్టకేలకు పట్టుకోవడంలో విజయం సాధించాం" అని చెప్పారు. ఇమ్మడి రవి కార్యకలాపాలపై కీలక విషయాలను వెల్లడించిన సజ్జనార్.. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్ సినిమాలను కూడా భారీ స్థాయిలో పైరసీ చేశాడని తెలిపారు.

## ఆర్‌ఎక్స్ 100 డైరెక్టర్ సినిమాలో అలనాటి హీరోయిన్ కూతురు..

టాకీస్: మహేశ్ బాబు సోదరుడు, దివంగత నటుడు రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడని తెలిసిందే. ఆర్‌ఎక్స్ 100 డైరెక్టర్ అజయ్ భూపతి కాంపౌండ్ నుంచి ఏబీ4గా రాబోతున్న ఈ చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో ఎవరు కనిపించబోతున్నారనే దానిపై క్లారిటీ వచ్చేసింది. అలనాటి అందాల హీరోయిన్ రవీనాటాండన్ కూతురు రషా తడనిని హీరోయిన్‌గా ఫైనల్ చేశాడు అజయ్ భూపతి. ఈ విషయాన్ని ప్రకటిస్తూ రషా తడని పోస్టర్ విడుదల చేసింది అజయ్ భూపతి టీం. మోడ్రన్ లుక్‌లో బైక్‌పై స్టైలిష్‌గా కూర్చున్న లుక్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. రషాకు ఇది టాలీవుడ్‌లో తొలి సినిమా. రషా కోసం అజయ్ భూపతి చాలెంజింగ్ రోల్‌ను సిద్ధం చేశాడని ఇన్‌సైడ్ టాక్. అజయ్ భూపతి సినిమాలంటే హీరోయిన్ పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంటుందని




తెలిసిందే. మరి ఈ సారి రషా తడనిని ఎలాంటి పాత్రలో చూపించబోతున్నాడన్నది ఆసక్తికరంగా మారింది. ఏబీ4 రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలో షురూ కానుంది. చందమామ కథలు పిక్చర్స్ బ్యానర్‌పై జెమినీ కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. అశ్వినిదత్ సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.